navajyothidaily.com

# నవజ్యోతి

తెలుగు దినపత్రిక




గంగ కత్వ కాలువ ఆధునీకరణకు

## రూ.37.81 కోట్లు

- జగ్గారెడ్డి చొరవతో నిధులు మంజూరు
- 3 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు



## 18 ఏళ్ల సేవ.. 13 ఏళ్లు అదే మండలంలో

- ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు గజవాడ లావణ్య ఎంపిక
- మల్లుపల్లి తండా నుంచి బురుగుపల్లి వరకు.. ప్రస్తుతం చొట్లపల్లిలో సేవలు

3లో..

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | మంగళవారం, 8 సెప్టెంబరు 2026 | ఎడిటర్ : మన్నే లక్ష్మణ్ | సంపుటి : 1 సంచిక : 404 | పేజీలు : 8 | వేల : 5/-

## స్పీకర్‌పై మాటలు.. సభలో కాంగ్రెస్ మంటలు

తాతా మధుపై చర్యలకు డిమాండ్..
కేసీఆర్ క్షమాపణ చెప్పాలన్న రేవంత్
1,000 రోజుల పాలనపై చర్చకు సిద్ధం..
బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై సీఎం సవాల్
స్పీకర్ చైర్‌ను అవమానిస్తే సహించేది లేదు..
ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి డెస్క్ ):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే అధికార కాంగ్రెస్--బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు వచ్చిన అనుచిత వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందించారు. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని, ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

### 'ఇవాళ తెలంగాణకు చీకటి రోజు'

స్పీకర్‌పై ఇలాంటి భాష ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్పీకర్ చైర్‌ను అవమానించడం అంటే శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని చెప్పారు. ఈ వ్యవహారాన్ని సభలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన పార్టీ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంబంధిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కూడా కోరారు.

(మిగతా.. 2లో)




# బీఆర్ఎస్ రణం

## నల్ల దుస్తులతో నిరసన.. పోలీసులతో తోపులాట.. కేటీఆర్, హరీశ్‌రావు సహా నేతల అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి డెస్క్ ):** అసెంబ్లీ సమావేశాల తొలిరోజే బీఆర్ఎస్ నిరసన ఉద్రిక్తంగా మారింది. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్లారు. నల్ల టీషర్టులపై ప్రభుత్వ వైఫల్యాలు, నెరవేరని హామీలను ప్రస్తావించే నినాదాలు ఉన్నాయి. ప్రధాన గేటు వద్ద పోలీసులు వారిని అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్‌కు తరలించారు.

### 420 హామీలపై నిలదీస్తాం: కేటీఆర్

అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్ వద్ద కేటీఆర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, వెయ్యి రోజులు పూర్తయినా హామీలు అమలు కాలేదని ఆరోపించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ హామీల అమలుపై సభలో ప్రశ్నిస్తామని తెలిపారు. రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పెన్షన్లు తదితర అంశాలను లేవనెత్తుతామని చెప్పారు. జీఓ 97తో పాటు పలు ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశ్నలు సంధిస్తామని, అన్ని ముఖ్యమైన అంశాలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### టీషర్టులు మార్చినా అడ్డుకున్నారు

నల్ల టీషర్టులతో సభలోకి అనుమతించకపోవడంతో కొంతమంది బీఆర్ఎస్ నేతలు టీషర్టులు తొలగించి బనియన్లు, ప్యాంట్లతో లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు.

(మిగతా.. 2లో)

అరెస్టులతో ఆపలేరు.. విద్యార్థుల కోసం

## పోరాటం ఆగదు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి..
విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు: రామచందర్‌రావు
10 రోజుల్లో నాలుగుసార్లు అరెస్టు.. అసెంబ్లీ ముట్టడిలో
బీజేపీ శ్రేణులతో పోలీసుల తోపులాట
ప్రశ్నిస్తే అరెస్టులా? బకాయిలు విడుదల చేసే వరకు
పోరాటం కొనసాగుతుందని
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి స్పష్టం




**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీజేపీ శ్రేణులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది.

### '10 రోజుల్లో నాలుగోసారి అరెస్టు'

అరెస్టు సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రశ్నిస్తున్నందుకే తనను పదేపదే అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. 10 రోజుల్లోనే తనను నాలుగోసారి అరెస్టు చేశారని చెప్పారు. విద్యార్థుల ఫీజులు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, బకాయిలు పేరుకుపోవడంతో కాలేజీల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

(మిగతా.. 2లో)



## ఫీజులు చెల్లించే వరకు పోరాటం

- విద్యార్థులతో కవిత ర్యాలీ.. కలెక్టరేట్ ఎదుట ధర్నా
- మూడేళ్లుగా బకాయిలు.. సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీల వేధింపులు: కవిత
- యువత నిరుద్యోగానికి ఫీజు బకాయిలే కారణం.. ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్

2లో..

## ఏపీలో కొత్త పార్టీకి విజయసాయిరెడ్డి శ్రీకారం

- రెండు కుటుంబాల పాలనకు ప్రత్యామ్నాయం అవసరం.. ప్రజలే కేంద్రంగా రాజకీయాలు: విజయసాయిరెడ్డి
- విజయవాడలో నేడు కీలక ప్రకటన.. తిరుపతి, అనంతపురం, విశాఖలోనూ వరుస సమావేశాలు




విజయవాడ, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో మాజీ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం విజయవాడలో నిర్వహించే మీడియా సమావేశంలో కొత్త పార్టీకి సంబంధించిన కీలక ప్రకటన చేయనున్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితుడిగా ఉన్న విజయసాయిరెడ్డి 2025 జనవరిలో పార్టీకి రాజీనామా చేశారు. అప్పట్లో రాజకీయాల నుంచి తప్పుకుని తన సొంత వ్యవహారాలపై దృష్టి పెడతానని ప్రకటించారు.

### రెండు కుటుంబాల ఆధిపత్యానికి ప్రత్యామ్నాయం

ఏపీలో ప్రస్తుతం కొనసాగుతున్న రెండు పార్టీల రాజకీయ వ్యవస్థ

(మిగతా.. 2లో)



## రూ.35 వేల కోట్ల ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం

- ఈరోజు గుజరాత్, మహారాష్ట్రలో ప్రధాని పర్యటన
- వెస్టన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తి.. మూడు కీలక సెక్షన్లు జాతికి అంకితం
- ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ ప్రారంభం.. ఏజెంటిక్ ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీలపై చర్చ

2లో..

తెలంగాణలో 'ఎస్ఐఆర్'కు

# మరోసారి పొడిగింపు

ఓటర్లకు మరింత సమయం.. క్లెయిమ్స్, అభ్యంతరాలకు అక్టోబర్ 7 వరకు అవకాశం
నవంబర్ 5లోగా అభ్యంతరాల పరిష్కారం.. నవంబర్ 9న తుది ఓటరు జాబితా
93 లక్షల మందికి నోటీసులు.. ప్రతి ఓటరుకు నోటీసు అందేలా చర్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి గడువు పొడిగించింది. క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు తొలుత సెప్టెంబర్ 16 వరకు ఉన్న గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించింది. అభ్యంతరాల పరిశీలన, విచారణ, పరిష్కార ప్రక్రియను నవంబర్ 5లోగా పూర్తి చేయాలని నిర్ణయించింది. అనంతరం నవంబర్ 9న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనుంది.

### మూడోసారి గడువు పొడిగింపు

తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత గడువు పొడిగించడం ఇది మూడోసారి. భారీ స్థాయిలో నోటీసులు జారీ కావడం, వాటి పంపిణీ, పత్రాల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారానికి మరింత సమయం అవసరం కావడంతో గడువును పెంచారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్‌రెడ్డి కూడా అదనపు సమయం కోరుతూ ఎన్నికల సంఘానికి ప్రతిపాదన పంపారు.

### 93 లక్షల మందికి నోటీసులు

ఎస్ఐఆర్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ అయ్యాయి. వీరి నుంచి

(మిగతా.. 2లో)

నవజ్యోతి
తెలుగు దినపత్రిక
navajyothidaily.com

# ఫీజులు చెల్లించే వరకు పోరాటం



**హనుమకొండ, సెప్టెంబర్ 7 (నవజ్యోతి డెస్క్ ):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై సుమారు గంటపాటు ధర్నా చేశారు.

**మూడేళ్లుగా బకాయిలు**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని కవిత ఆరోపించారు. బకాయిలు విడుదల కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో వారు ఉద్యోగాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**కాలేజీలూ మూతపడుతున్నాయి**

ఫీజు బకాయిల ప్రభావం విద్యార్థులకే కాకుండా చిన్న ప్రైవేట్ కాలేజీలపైనా పడుతోందని కవిత అన్నారు. బకాయిలు అందక కొన్ని కాలేజీలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. విద్యార్థుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**'ఫీజులు చెల్లించే వరకు పోరాటం'**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

**కలెక్టర్‌కు వినతి..**

కవిత, విద్యార్థుల నుంచి హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వినతిపత్రం స్వీకరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల విద్యార్థులు, కాలేజీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు వివరించారు. వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**డీజీపీపై కవిత ఫైర్..**

మరోవైపు తనపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఓ పోలీసు కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేయడంపై కవిత తీవ్రంగా స్పందించారు. కానిస్టేబుల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. డీజీపీ సీవీ ఆనంద్ తీరుపై కూడా కవిత తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రత, శాంతిభద్రతల పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తారు. తనలాంటి మాజీ ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

**మహిళా ఎమ్మెల్యేల ఘటనపైనా స్పందన**

అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు వ్యవహరించిన తీరుపైనా కవిత స్పందించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధులకే భద్రత లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

# తెలంగాణలో ఎస్ఐఆర్‌కు మరోసారి పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి..)

అవసరమైన పత్రాలు స్వీకరించి, అభ్యంతరాలు పరిశీలించి తుది జాబితాను రూపొందించనున్నారు. నోటీసులను సంబంధిత ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు స్వయంగా అందించాలని సీఈవో అధికారులను ఆదేశించారు.

**బీఎల్ఓలకు కీలక ఆదేశాలు**

ప్రతి నోటీసును సంబంధిత ఓటరికి వ్యక్తిగతంగా అందించాలని బీఎల్ఓలకు ఆదేశాలు జారీ అయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల చిరునామాలను గుర్తించేందుకు బూత్ లెవల్ ఏజెంట్ల సహకారం తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని, పత్రాల అప్‌లోడ్‌లో పొరపాట్లు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సీఈవో స్పష్టం చేశారు.

**వృద్ధులు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి**

విచారణ కేంద్రాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు అధికారులు వెళ్లి అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. ఓటర్లకు సమాచారం, సహాయం అందించేందుకు ఈఆర్ఓ, డీఈఓ స్థాయిలో హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేశారు.

**ఇక నవంబర్ 9న ఫైనల్ లిస్ట్**

కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తారు. వాటిపై విచారణ, పరిష్కార ప్రక్రియ నవంబర్ 5 వరకు కొనసాగుతుంది. అన్ని ప్రక్రియలు పూర్తయిన తర్వాత నవంబర్ 9న తుది ఓటరు జాబితా వెలువడనుంది. గత షెడ్యూల్‌లో అక్టోబర్ 19న తుది జాబితా ప్రకటించాల్సి ఉండగా.. తాజాగా మరోసారి పొడిగించారు. మొత్తంగా ఓటర్లకు మరో 21 రోజుల అదనపు అవకాశం లభించింది. తమ పేరు, వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకోవడంతో పాటు అభ్యంతరం లేదా క్లెయిమ్ ఉంటే అక్టోబర్ 7లోగా దాఖలు చేసుకోవడానికి ఈ పొడిగింపు అవకాశం కల్పిస్తోంది.

# ఏపీలో కొత్త పార్టీకి విజయసాయిరెడ్డి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి..)

సామాన్య ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలను పూర్తిస్థాయిలో ప్రతిబింబించడం లేదని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర రాజకీయాలు రెండు కుటుంబాల పాలనగా మారాయని విమర్శించారు. ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని పనిచేసే ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

**'ప్రజలకు ప్రత్యామ్నాయం చూపిస్తాం'**

రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కొత్త పార్టీ ప్రధానంగా ప్రస్తావిస్తుందని విజయసాయిరెడ్డి తెలిపారు. రెండు కుటుంబాల ఆధిపత్యాన్ని అధిగమించేందుకు ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను అందించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త పార్టీ ప్రజల కోసం పనిచేస్తుందని, పాలనలో ప్రజల ప్రయోజనాలనే కేంద్రంగా చేసుకుంటుందని వెల్లడించారు.

**నాలుగు నగరాల్లో వరుస సమావేశాలు**

కొత్త పార్టీ ఏర్పాటుపై ప్రజలకు వివరించేందుకు విజయసాయిరెడ్డి నాలుగు ప్రాంతాల్లో వరుసగా మీడియా సమావేశాలు నిర్వహించనున్నారు. తొలి సమావేశాన్ని సెప్టెంబర్ 7న విజయవాడలో నిర్వహించనున్నారు. అనంతరం తిరుపతి, అనంతపురం, విశాఖపట్నంలో మరో మూడు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రెండు పార్టీల రాజకీయ వ్యవస్థపై తన అభిప్రాయాలను వివరించనున్నారు.

**జగన్‌కు సన్నిహితుడి నుంచి కొత్త రాజకీయ ప్రయాణం**

విజయసాయిరెడ్డి గతంలో వైఎస్సార్‌సీపీలో కీలక నేతగా వ్యవహరించారు. జగన్‌కు అత్యంత సన్నిహితులైన నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేశారు. 2025 జనవరిలో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన ఆయన.. ఇప్పుడు కొత్త పార్టీ ఏర్పాటుతో మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. రెండు కుటుంబాల ఆధిపత్యానికి ప్రత్యామ్నాయం పేరుతో విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేయనుండటంతో ఏపీ రాజకీయాల్లో మరో కొత్త సమీకరణానికి తెరలేచినట్లయింది.

# అరెస్టులతో ఆపలేరు..
# విద్యార్థుల కోసం పోరాటం ఆగదు




(మొదటి పేజీ తరువాయి..)

**'విద్యార్థుల డబ్బులు ఎక్కడ?'**

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారని రామచందర్‌రావు అన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని అడగడం తప్పా? విద్యార్థుల తరఫున ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. బకాయిలు పూర్తిగా విడుదల చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత**

రామచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకునే సమయంలో బీజేపీ కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ కుండే పోలీసు వాహనంపైకి ఎక్కి నిరసన తెలిపారు. పలువురు కార్యకర్తలు పోలీసు వాహనానికి అడ్డంగా పడుకుని రామచందర్‌రావును తరలించకుండా అడ్డుకున్నారు. పోలీసులు వారిని అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేయడంతో తోపులాట జరిగింది. ఈ ఘటనలో పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయని బీజేపీ నేతలు తెలిపారు. ఇద్దరు కార్యకర్తల చేతులకు ఫ్రాక్చర్లు అయ్యాయని పేర్కొన్నారు.

**బీజేపీ ఎమ్మెల్యేల పోరాటం**

అసెంబ్లీలోనూ బీజేపీ ఎమ్మెల్యేలు విద్యార్థుల సమస్యతో పాటు 22ఏ భూముల అంశాన్ని ప్రధానంగా లేవనెత్తారు. నిషేధిత జాబితాలో భూముల చేర్పుపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీజేపీ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. దీంతో సభలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**బయట అరెస్టులు.. లోపల నిరసన**

అసెంబ్లీ వెలుపల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం రామచందర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ ఆందోళనకు దిగగా.. సభలో బీజేపీ ఎమ్మెల్యేలు 22ఏ భూముల అంశంపై పట్టుబట్టారు. ఒకేరోజు బీజేపీకి చెందిన రెండు వర్గాల నిరసనలు అసెంబ్లీ పరిసరాల్లో రాజకీయ వేడిని పెంచాయి. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించడం తమ హక్కు అని, అరెస్టులు చేసినా వెనక్కి తగ్గేది లేదని రామచందర్‌రావు స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.

# రూ.35 వేల కోట్ల ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం గుజరాత్, మహారాష్ట్రల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రూ.35 వేల కోట్లకు పైగా విలువైన రైల్వే, రహదారి, మౌలిక వసతుల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వడోదరలో జరిగే కార్యక్రమంలో వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌కు చెందిన మూడు కీలక సెక్షన్లను జాతికి అంకితం చేయనున్నారు. దీంతో దేశంలోని డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ నెట్‌వర్క్ మొత్తం పూర్తిస్థాయిలో కార్యకలాపాలకు అందుబాటులోకి రానుంది.

**326 కి.మీ. ఫ్రైట్ కారిడార్**

మోదీ జాతికి అంకితం చేయనున్న మూడు సెక్షన్లు కలిపి 326 రూట్ కిలోమీటర్లు ఉన్నాయి. వీటి నిర్మాణానికి రూ.20,700 కోట్లకు పైగా వ్యయం చేశారు. సనంద్--మకర్‌పురా, న్యూ ఉంబర్‌గావ్--న్యూ సఫాలే, న్యూ సఫాలే--జేఎన్‌పీటీ సెక్షన్లు ఇందులో ఉన్నాయి. ఈ మార్గాలతో పారిశ్రామిక ప్రాంతాల నుంచి నౌకాశ్రయాలకు సరుకు రవాణా వేగవంతం కానుంది. ఎగుమతులు, దిగుమతుల సరుకు రవాణాకు సమయం తగ్గడంతో పాటు లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. ముంబై రైల్వే నెట్‌వర్క్‌పై సరుకు రవాణా ఒత్తిడి కూడా తగ్గనుంది.

**కొత్త రైలు సర్వీసులు**

మోదీ వడోదర కార్యక్రమంలో పలు సరుకు రైలు సర్వీసులను ప్రారంభించనున్నారు. న్యూ సనంద్ నార్త్, న్యూ మకర్‌పురా, న్యూ ఉంబర్‌గావ్, న్యూ జేఎన్‌పీటీ నుంచి ఫ్రైట్ ట్రైన్ సర్వీసులు ప్రారంభం కానున్నాయి. వడోదర--టాండా రోడ్ మధ్య కొత్త ప్రయాణికుల రైలు సర్వీసును కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. దీంతో వడోదర, ఛోటా ఉదేపూర్, అలీరాజ్‌పూర్ ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం కలగనుంది.

**329 కి.మీ. రైల్వే ప్రాజెక్టులు**

రూ.9,700 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు రైల్వే ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. వడోదర--రత్లాం మూడో, నాలుగో లైన్లు, మియాగాం కర్జన్--చోరండా--మల్సర్ గేజ్ మార్పిడి, విశ్వామిత్రి--దభోయి డబ్లింగ్ ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ప్రయాణికులు, సరుకు రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు గుజరాత్--మధ్యప్రదేశ్ మధ్య రైల్వే కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది.

**రోడ్లకు రూ.1,780 కోట్లు**

మూడు జాతీయ రహదారి ప్రాజెక్టులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. వీటి అంచనా వ్యయం సుమారు రూ.1,780 కోట్లు. ఎన్‌హెచ్--48లో కామ్రేజ్--చల్థాన్ సెక్షన్ ఆరు లేన్లుగా విస్తరణ, వడోదర--సూరత్ మార్గంలో తాపీ, నర్మదా నదులపై అదనపు వంతెనలు, ఎన్‌హెచ్--53పై పలు జంక్షన్ల వద్ద గ్రేడ్ సెపరేటెడ్ నిర్మాణాలు ఇందులో ఉన్నాయి.

**ముంబైలో ఫిన్‌టెక్ ఫెస్ట్**

సాయంత్రం ముంబైలో జరిగే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్--2026ను మోదీ ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, సాంకేతిక రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. ఈ ఏడాది సదస్సు ప్రధానంగా ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ ఫైనాన్స్, ఆర్థిక సమ్మిళితత్వంపై దృష్టి సారించనుంది. డిజిటల్ చెల్లింపులు, ఫిన్‌టెక్ రంగంలో భారత్ సాధించిన పురోగతిని ప్రపంచానికి వివరించేందుకు ఇది కీలక వేదికగా నిలవనుంది. వడోదరలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు.. ముంబైలో భవిష్యత్ ఆర్థిక సాంకేతికతపై సదస్సు.. ఒకేరోజు రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటనకు కేంద్రం భారీగా ఏర్పాట్లు చేస్తోంది.

# స్పీకర్‌పై మాటలు.. సభలో కాంగ్రెస్ మంటలు



**సీతక్క కంటతడి.. 'ఇది బాధాకరం'**

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అంశంపై మంత్రి సీతక్క సభలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాతా మధు వ్యాఖ్యలపై స్పందిస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. స్పీకర్ పదవిని, వ్యక్తిని అవమానించేలా మాట్లాడటం సరికాదని అన్నారు. తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీతక్క డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా ఈ వ్యవహారంపై స్పందించాలని కోరారు.

**'తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలి'**

మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని అన్నారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేసి, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి చర్యలు తీసుకోవాలని కోరారు. తాతా మధు వ్యాఖ్యలకు కేసీఆర్ సమాధానం చెప్పాలని కూడా పొన్నం డిమాండ్ చేశారు.

**కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫైర్**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా తాతా మధు వ్యవహారంపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ సభకు అధిపతి అని, ఆ పదవిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవని అన్నారు. స్పీకర్ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సభ్యులందరిపైనా ఉందని స్పష్టం చేశారు. స్పీకర్‌పై వ్యాఖ్యల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**దామోదర రాజనర్సింహ మండిపాటు**

మంత్రి దామోదర రాజనర్సింహ స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం శాసన వ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**స్పీకర్ భావోద్వేగం**

ఈ వివాదంపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా తీవ్రంగా స్పందించారు. తాతా మధు చేసినట్లు వచ్చిన వ్యాఖ్యలు తనను బాధించాయని తెలిపారు. సభలో సీతక్క కన్నీళ్లు పెట్టుకోవడం చూసి తాను కూడా భావోద్వేగానికి గురయ్యానని చెప్పారు. ఈ వ్యవహారాన్ని సభలో చర్చించి తీర్మానం చేయనున్నట్లు స్పీకర్ వెల్లడించారు. అనంతరం ఆ తీర్మానాన్ని శాసనమండలికి పంపుతామని తెలిపారు. సభ గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**కేసీఆర్‌పై రేవంత్ మరోసారి సవాల్**

బీఆర్ఎస్ వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేస్తున్న నేపథ్యంలో రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై మరోసారి ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో ఏం చేసిందో, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏం చేసిందో అసెంబ్లీలో చర్చిద్దామని సవాల్ చేశారు. కేసీఆర్ ప్రతిపక్ష నేతగా సభకు వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. తన పదేళ్ల పాలనపై మాట్లాడేందుకు కేసీఆర్ సిద్ధమైతే.. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై కూడా చర్చకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్‌కు పనితీరుతోనే కౌంటర్**

వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు రైతు రుణమాఫీ, ఉద్యోగ నియామకాలు, ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలను కాంగ్రెస్ తన కౌంటర్‌గా ముందుకు తెచ్చింది. ప్రభుత్వం చేసిన పనులపై సభలో వివరంగా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని అధికార పక్షం స్పష్టం చేసింది.

**తాతా మధు వివరణ**

మరోవైపు తనపై వచ్చిన ఆరోపణలను తాతా మధు ఖండించారు. తాను స్పీకర్‌ను ఏమీ అనలేదని, తన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని చెప్పారు. స్పీకర్ చైర్‌ను తాను గౌరవిస్తానని స్పష్టం చేశారు.

**సభలో కాంగ్రెస్ ఎదురుదాడి**

అసెంబ్లీ బయట బీఆర్ఎస్ నిరసన, పోలీసులతో ఘర్షణ జరుగుతున్న సమయంలో.. సభలో కాంగ్రెస్ స్పీకర్ అంశాన్ని ప్రధానంగా తీసుకుంది. తాతా మధుపై చర్యలు, కేసీఆర్ క్షమాపణ, కేసీఆర్ అసెంబ్లీకి హాజరు, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై చర్చ వంటి అంశాలతో అధికార పక్షం ప్రతిపక్షంపై ఎదురుదాడి చేసింది. బయట బీఆర్ఎస్ నిరసనతో రణరంగం.. లోపల స్పీకర్ అంశంపై కాంగ్రెస్ ఎదురుదాడి.. ఇలా అసెంబ్లీ సమావేశాల తొలిరోజే తెలంగాణ రాజకీయాల్లో వేడి మరింత పెరిగింది.

# అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ రణం





అయినా పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తెలంగాణ భవన్‌కు తరలించారు.

**సునీత చీర లాగారు.. సబిత జుట్టు పట్టుకున్నారు**

తోపులాటలో మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపించింది. సునీతా లక్ష్మారెడ్డి తన చీరను పోలీసులు లాగారని, ఈ ఘటనతో తీవ్రంగా అవమానానికి గురయ్యానంటూ కన్నీటి పర్యంతమయ్యారు. సబితా ఇంద్రారెడ్డి తనను పోలీసు సిబ్బంది జుట్టు పట్టుకుని లాగారని ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ నేతల కథనం ప్రకారం సబితా ఇంద్రారెడ్డి గొంతు పట్టుకుని లాగారని, సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగారని, పలువురు ఎమ్మెల్యేలను కిందపడేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు మీడియా సమావేశాల్లో వెల్లడించారు.

**'ఇది అసెంబ్లీనా.. కౌరవ సభా?': హరీశ్‌రావు**

తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనను తెలంగాణ శాసనసభ చరిత్రలో బ్లాక్ డేగా అభివర్ణించారు. మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగడం, సబితా ఇంద్రారెడ్డిని జుట్టు పట్టుకుని లాగడం, గొంతు పట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 'ఇది అసెంబ్లీనా.. కౌరవ సభా?' అని ప్రశ్నించిన హరీశ్‌రావు.. ప్రజా ప్రతినిధులపై పోలీసులు బలప్రయోగం చేయడం ఏమిటని నిలదీశారు. బాధ్యులైన పోలీసులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై సభలో మాట్లాడకుండా తమను అడ్డుకున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రతిపక్షాన్ని సభకు దూరం చేయాలని చూస్తోందని విమర్శించారు.

**పలువురికి గాయాలు**

తోపులాటలో కేటీఆర్ చేతి, ముఖంపై గీతలు పడ్డాయని బీఆర్ఎస్ తెలిపింది. జి.జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, కె.సంజయ్, ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి తదితరులకు గాయాలయ్యాయని పార్టీ నేతలు వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో వారికి ప్రాథమిక చికిత్స అందించారు.

**ప్రశాంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలంగాణ భవన్‌లో మాట్లాడుతూ పోలీసుల బలప్రయోగాన్ని తీవ్రంగా ఖండించారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా ఎమ్మెల్యేలను పోలీసులు కిందపడేసి తొక్కారని ఆరోపించారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు పట్టుకున్నారని, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని ఆరోపించారు. సుమారు 2,000 మంది పోలీసులను అసెంబ్లీ వద్ద మోహరించారని, బీఆర్ఎస్ నేతలను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, విజయుడు, మానిక్‌రావు, అనిల్ జాదవ్‌లను పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపిస్తూ పార్టీ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

**హరీశ్ ప్రశ్న.. నల్ల దుస్తులపై ఆంక్షలేంటి?**

నిరసనలో భాగంగా నల్ల దుస్తులు ధరించడం ప్రజాస్వామ్య హక్కు అని హరీశ్‌రావు అన్నారు. గతంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పార్లమెంట్‌కు నల్ల టీషర్టులతో వెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఒకే అంశంలో వేర్వేరు నిబంధనలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. తమ టీషర్టులపై అభ్యంతరకర నినాదాలు లేవని కూడా ఆయన పేర్కొన్నారు.

**హైకోర్టు జోక్యం**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్న ఘటనపై తెలంగాణ హైకోర్టు స్పందించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని డీజీపీని ఆదేశించింది. ప్రజలచే ఎన్నికైన ప్రతినిధులు శాసనసభ సమావేశాలకు హాజరై తమ విధులు నిర్వర్తించే అవకాశం ఉండాలని కోర్టు స్పష్టం చేసింది.

**ఒకేరోజు.. అరెస్టులు, ఘర్షణ, ఆరోపణలు**

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు బీఆర్ఎస్ చేపట్టిన నల్ల దుస్తుల నిరసనతో ఉదయం నుంచే ఉద్రిక్తత నెలకొంది. కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడం, మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపించడం, పలువురు నేతలకు గాయాలు కావడం, తెలంగాణ భవన్‌లో వరుసగా మీడియా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ నేతలు మండిపడటం, అనంతరం హైకోర్టు జోక్యం చేసుకోవడంతో తొలిరోజు సమావేశాలు రాజకీయంగా వేడెక్కాయి.



## గంగ కత్వ కాలువ ఆధునీకరణకు
# రూ.37.81 కోట్లు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):** సదాశివపేట మండలంలోని నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధునీకరణకు ప్రభుత్వం రూ.37.81 కోట్లు మంజూరు చేసింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చొరవతో రూపొందించిన ప్రతిపాదనలకు పరిపాలనా అనుమతులు ఇస్తూ నీటిపారుదల శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూరారం గ్రామం నుంచి ప్రారంభమయ్యే ఈ కాలువ దశాబ్దాలుగా పూర్తిస్థాయి మరమ్మతులకు నోచుకోలేదు. ఆయకట్టు రైతులు, స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు మూడు నెలల క్రితం జగ్గారెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి ఆధునీకరణకు కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అధికారులు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. సూరారం నుంచి మాచిరెడ్డిపల్లి వరకు 11 గ్రామాలను కలుపుతూ సుమారు 15 కిలోమీటర్ల మేర గంగ కత్వ కాలువ విస్తరించి ఉంది. కాలువకు 33 చెరువుల నుంచి ఫీడర్ చానళ్లు ఉన్నాయి. ఆధునీకరణలో భాగంగా కాలువ లైనింగ్, అవసరమైన ప్రాంతాల్లో కొత్త వంతెనల నిర్మాణం, పాత వంతెనలు, తూముల మరమ్మతులు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే సుమారు 3 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. నిధుల మంజూరుపై జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# 18 ఏళ్ల సేవ.. 13 ఏళ్లు అదే మండలంలో

## ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు గజవాడ లావణ్య ఎంపిక

## మల్లుపల్లి తండా నుంచి బురుగుపల్లి వరకు.. ప్రస్తుతం చౌట్లపల్లిలో సేవలు

**మెదక్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):** ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు గజవాడ లావణ్య ఎంపికయ్యారు. మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన ఆమె ఉపాధ్యాయ వృత్తిలో 18 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. ఇందులో 13 ఏళ్లపాటు ఇదే మండలంలో పనిచేశారు. ప్రస్తుతం చౌట్లపల్లి పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. అవార్డు సందర్భంగా లావణ్య తన ఉద్యోగ ప్రస్థానంలో తనకు అండగా నిలిచిన తల్లిదండ్రులు, గురువులు, కుటుంబ సభ్యులు, అధికారులు, సహచరులను గుర్తుచేసుకున్నారు.

**తొలి పోస్టింగ్.. మల్లుపల్లి తండా**

లావణ్యకు తొలి పోస్టింగ్ మల్లుపల్లి తండా పాఠశాలలో సింగిల్ టీచర్‌గా వచ్చింది. 70 మంది విద్యార్థులకు ఒంటరిగా బోధించాల్సి రావడంతో తొలుత భయపడినట్లు తెలిపారు. అప్పటి కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణయ్య సర్ బైక్‌పై స్వయంగా పాఠశాలకు తీసుకెళ్లి, టైమ్‌టేబుల్ రూపొందించి పాఠాలు చెప్పే విధానాన్ని వివరించి ధైర్యం చెప్పారని గుర్తుచేశారు.

**బురుగుపల్లిలో 11 ఏళ్ల సేవ**

13 ఏళ్ల మండల సేవలో 11 ఏళ్లు బురుగుపల్లి పాఠశాలలో పనిచేశానని లావణ్య తెలిపారు. అప్పటి హెచ్‌ఎం ప్రభాకర్ శర్మ సర్ విద్యార్థుల చదువు, ప్రగతిపై



సూచనలు చేస్తూ ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేసేవారని చెప్పారు. బురుగుపల్లిలో ప్రైమరీ, హైస్కూల్ ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించామని తెలిపారు.

**తల్లిదండ్రులే స్ఫూర్తి**

తాను ఉపాధ్యాయురాలిగా ఎదగడానికి తల్లిదండ్రులే ప్రధాన కారణమని లావణ్య పేర్కొన్నారు. తల్లికి పెద్దగా చదువు లేకపోయినా, టీచర్ వృత్తిపై ఉన్న గౌరవంతో తనను ఉపాధ్యాయురాలిగా చూడాలనుకున్నారని చెప్పారు. తండ్రి నేర్పిన క్రమశిక్షణ, నైతిక విలువలు తన జీవితంలో ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల ఆశీస్సులు కూడా తన విజయానికి కారణమన్నారు.

**కుటుంబం.. సహచరుల అండ**

ఉద్యోగ ప్రస్థానంలో అత్తమ్మ సహకారం ఎంతో ముఖ్యమని లావణ్య తెలిపారు. తన కుమార్తె ఐదు నెలల చంటిపిల్లగా ఉన్న సమయంలో అత్తమ్మే పాపను చూసుకుంటూ తనకు అండగా నిలిచారని చెప్పారు. భర్త గజవాడ మహేష్ కుమార్ అనుభవం, సహకారం వల్ల తాను ప్రశాంతంగా విధులు నిర్వహించగలిగానన్నారు. ఆయనను డిపార్ట్‌మెంట్‌లో అందరూ 'వాకింగ్ జీఓ బుక్'గా పిలుస్తారని తెలిపారు.

**తనకు తెలియకుండానే దరఖాస్తు**

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేయాలనే ఆలోచన తనకు లేదని లావణ్య చెప్పారు. అయితే తిమ్మాపూర్ మధుసూదన్ సర్, ప్రణీత్ సర్ తదితర సహచరులు తనకు తెలియకుండానే దరఖాస్తు సిద్ధం చేసి సమర్పించారని తెలిపారు. అవార్డుకు ఎంపిక చేసిన ఎంఈఓ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సహచర మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

---

## ప్యాకెట్‌లో ఉన్నదే కాదు..
# ప్యాకెట్‌పై ఉన్నదీ నిజమేనా?

### చక్కెర.. ఉప్పు.. కొవ్వు నుంచి నకిలీ లేబుళ్ల వరకు ..

### వినియోగదారుడి ఆరోగ్యంతో ఆటలాడుతున్న వ్యవస్థపై ప్రశ్నలు..

### సుప్రీంకోర్టు అసహనం.. తుకారాం ముండే దాడులు చెబుతున్న మరో నిజం




**హైదరాబాద్, సెప్టెంబర్ 07 (నవజ్యోతి ఎడిటోరియల్):** ప్యాకెట్ ఆకర్షణీయంగా ఉంటుంది. బ్రాండ్ పేరు నమ్మకాన్ని కలిగిస్తుంది. ప్రకటనలు మరింత ఆకర్షిస్తాయి. కానీ ఆ ప్యాకెట్‌లో ఉన్న ఆహారం ఎంత ఆరోగ్యకరం? అందులో చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఎంత? ప్యాకెట్‌పై ముద్రించిన సమాచారం నిజమేనా? సాధారణ వినియోగదారుడికి వీటికి సమాధానం తెలియదు. అతడు నమ్మేది ప్యాకెట్‌పై ఉన్న సమాచారాన్నే. ఆ సమాచారమే తప్పుదోవ పట్టిస్తే.. వినియోగదారుడి ఎంపిక ఎంతవరకు నిజమైనదవుతుంది? ఇప్పుడు దేశంలో జరుగుతున్న పరిణామాలు ఈ ప్రశ్నను మరింత గట్టిగా మన ముందుంచుతున్నాయి. ఒకవైపు అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉన్న ప్యాకెట్ ఆహారాలపై ముందుభాగంలోనే స్పష్టమైన హెచ్చరికలు ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు ఈ విషయంలో ఆలస్యం జరుగుతోందంటూ సుప్రీంకోర్టు ఆహార నియంత్రణ సంస్థను ప్రశ్నిస్తోంది. మహారాష్ట్రలో తుకారాం ముండే నేతృత్వంలో జరుగుతున్న తనిఖీల్లో గడువు తేదీలు, తయారీ వివరాలు, పోషక సమాచారాన్ని మార్చేందుకు జరిగిన ప్రయత్నాలు బయటపడటం సమస్యను మరో కోణంలోకి తీసుకెళ్లింది. అంటే సమస్య ప్యాకెట్‌లోని పదార్థాలతో మాత్రమే పరిమితం కాదు. ప్యాకెట్‌పై ఉన్న సమాచారాన్ని ఎంతవరకు నమ్మవచ్చన్నదీ ఇప్పుడు కీలకంగా మారింది.

### ప్యాకెట్ ముందు భాగంలోనే నిజం కనిపించాలి

ప్యాకెట్ వెనుక భాగంలో చిన్న అక్షరాలతో పోషక వివరాలు ఇవ్వడం మాత్రమే చాలదన్న వాదన బలపడుతోంది. వినియోగదారుడు దుకాణంలో నిలబడి ప్రతి ఉత్పత్తి వెనుక లేబుల్ చదివి, పోషకాల లెక్కలు వేసుకుని కొనుగోలు చేయడం సాధ్యం కాదు. అందుకే అధిక స్థాయిలో ఉన్న చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు వంటి పోషకాల గురించి ప్యాకెట్ ముందుభాగంలోనే సులభంగా అర్థమయ్యే హెచ్చరిక ఉండాలన్న డిమాండ్ ముందుకొస్తోంది. ఉత్పత్తిని నిషేధించడం దీని ఉద్దేశం కాదు. కొనుగోలు చేసే ముందు వినియోగదారుడికి ప్రమాదాన్ని తెలియజేయడమే అసలు లక్ష్యం. ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ప్రతిపాదిస్తున్న విధానంలో అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు వంటి పోషకాలపై స్పష్టమైన హెచ్చరిక గుర్తులు ఉండేలా చర్యలు చర్చలో ఉన్నాయి. అయితే మూడు పోషకాలలో కనీసం రెండింటి పరిమితి దాటినప్పుడే హెచ్చరిక వర్తించే విధానంపై ఆరోగ్య నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పోషకం పరిమితి దాటినా వినియోగదారుడికి ఆ విషయం తెలిసే హక్కు ఉండాలని వారు అంటున్నారు.

### సుప్రీంకోర్టు ప్రశ్న.. పిల్లల ఆరోగ్యం ఎవరి బాధ్యత?

ప్యాకెట్ ఆహారాలపై ముందుభాగంలో హెచ్చరికల విషయంలో ఆలస్యం జరుగుతుండటంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా పిల్లలు అనారోగ్యకరమైన చిరుతిళ్లకు అలవాటు పడుతున్న పరిస్థితిని ధర్మాసనం ప్రస్తావించింది. పరిశ్రమ ఒత్తిడి ఉందా? ప్రజలు, ముఖ్యంగా పిల్లలు ఆరోగ్యంగా ఎదగడం ప్రభుత్వానికి అవసరం లేదా? అన్న స్థాయిలో ప్రశ్నలు సంధించడం ఈ అంశం తీవ్రతను తెలియజేస్తోంది. ఇది ఒక హెచ్చరిక గుర్తును ప్యాకెట్‌పై ముద్రించే అంశంగా మాత్రమే చూడలేం. పిల్లల ఆహార అలవాట్లను ప్రభావితం చేస్తున్న విస్తృత వ్యవస్థను ప్రభుత్వం ఎంత వేగంగా, ఎంత సమర్థంగా నియంత్రించగలదన్నదే అసలు ప్రశ్న. ప్యాకెట్ ఆహారాల విషయంలో ప్రకటనలకు ఉన్న ఆకర్షణను ఎదుర్కొనేంత స్పష్టతతో ఆరోగ్య సమాచారం కూడా వినియోగదారుడి కంటికి కనిపించాలి.

### ముండే దాడులు.. మరో చీకటి కోణం

మహారాష్ట్రలో ఆహార, ఔషధ పరిపాలన శాఖ కమిషనర్ తుకారాం ముండే నేతృత్వంలో జరుగుతున్న తనిఖీలు ఆహార భద్రత సమస్యను మరో స్థాయికి తీసుకెళ్లాయి. నవి ముంబైలోని ఒక గోడౌన్‌పై జరిగిన దాడిలో తయారీ తేదీలు, గడువు తేదీలు, పోషక సమాచారాన్ని మార్చేందుకు ఉపయోగించిన రసాయనాలు, ముద్రణ పరికరాలను అధికారులు గుర్తించినట్లు వెల్లడించారు. పలు ప్రముఖ బ్రాండ్లకు చెందిన ఉత్పత్తులు అక్కడ ఉన్నట్లు దర్యాప్తు వివరాలు వెల్లడించాయి. లేస్, కుర్‌కురే, మ్యాగీ, నార్, హెల్‌మాన్స్, థమ్స్ అప్, లిమ్కా వంటి ఉత్పత్తులు అక్కడ ఉన్నట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారంలో సంబంధిత కంపెనీలే లేబుళ్లు మార్చినట్లు నిర్ధారణ కాలేదు. వారి బ్రాండ్‌లకు చెందిన ఉత్పత్తులను ఉపయోగించి నకిలీ లేబుళ్ల వ్యవహారం సాగినట్లు అధికారులు గుర్తించిన అంశంగానే దీనిని చూడాలి. దర్యాప్తు పూర్తికాకముందే కంపెనీలపై నేరుగా నిందలు మోపడం సరికాదు. కానీ సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా లేబుల్ మార్చే అవకాశం ఉంటే అది మాత్రం తీవ్రమైన భద్రతా లోపమే. ఎందుకంటే ఒకసారి గడువు తేదీ లేదా పోషక వివరాలు మారితే వినియోగదారుడి నిర్ణయం మొత్తం తప్పుదోవ పట్టే ప్రమాదం ఉంటుంది.

### ఇక ప్రశ్న మారాలి

ఇప్పటి వరకు వినియోగదారుడు "ప్యాకెట్‌లో ఏముంది?" అని అడిగాడు. ఇకపై "ప్యాకెట్‌పై ఉన్న సమాచారం నిజమేనా?" అని కూడా అడగాలి. గడువు తేదీ మార్చడం వినియోగదారుడిని మోసం చేయడమే. పోషక విలువలను మార్చడం కూడా అంతే తీవ్రమైన విషయం. ఎందుకంటే వినియోగదారుడు తన ఆరోగ్య నిర్ణయాన్ని అదే సమాచారంపై ఆధారపడి తీసుకుంటాడు. గడువు తేదీ ఒక ముద్ర మాత్రమే కాదు. ఆ ఉత్పత్తిని ఎంతకాలం సురక్షితంగా వినియోగించవచ్చో తెలిపే హామీ. పోషక వివరాలు కేవలం అక్షరాలు కావు. అవి వినియోగదారుడికి ఉన్న సమాచార హక్కులో భాగం.

### పరిశ్రమ వాదనను కూడా విస్మరించలేం

కఠినమైన హెచ్చరికల విధానం అమల్లోకి వస్తే పెద్ద సంఖ్యలో ప్యాకెట్ ఆహారాలపై హెచ్చరికలు రావచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీనివల్ల ఉత్పత్తులపై వినియోగదారుల అభిప్రాయం, డిమాండ్, వ్యాపారంపై ప్రభావం పడవచ్చన్నది వారి వాదన. ఈ వాదనను పూర్తిగా కొట్టిపారేయాల్సిన అవసరం లేదు. నిబంధనలు శాస్త్రీయ ఆధారాలతో ఉండాలి. ఏ ఉత్పత్తికి ఏ పరిమితి వర్తించాలి అన్నది స్పష్టంగా ఉండాలి. ఒకే రకమైన ఉత్పత్తులకు ఒకే ప్రమాణం ఉండాలి. పరిశ్రమకు మార్పులు చేసుకునేందుకు తగిన సమయం కూడా ఇవ్వాలి. కానీ వ్యాపార ప్రయోజనాలు, ప్రజారోగ్య ప్రయోజనాల మధ్య ఎంపిక చేయాల్సి వస్తే.. కనీసం నిజమైన సమాచారం విషయంలో మాత్రం రాజీ ఉండకూడదు. నియంత్రణ లక్ష్యం కంపెనీలను ఇబ్బంది పెట్టడం కాదు. వినియోగదారుడు సరైన నిర్ణయం తీసుకునేలా చేయడం. అందుకే కఠినమైన నియంత్రణతో పాటు స్పష్టమైన నిబంధనలు, న్యాయమైన అమలు కూడా అవసరం.

**మూడు పోషకాల్లో.. రెండే అధికంగా ఉండాలా?**

**ఇక్కడే అసలు ప్రశ్న. ఒక ఉత్పత్తిలో చక్కెర మాత్రమే అధికంగా ఉండి, ఉప్పు, సంతృప్త కొవ్వు పరిమితుల్లో ఉంటే హెచ్చరిక తప్పించుకునే అవకాశం ఉంటుంది. అదే విధంగా ఉప్పు లేదా సంతృప్త కొవ్వు ఒక్కటే అధికంగా ఉన్నా ఇదే పరిస్థితి తలెత్తవచ్చు. ఒక ఉత్పత్తిలో ఒక ముఖ్యమైన పోషకం ప్రమాదకర స్థాయిలో ఉందని తెలిసినా వినియోగదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పకపోవడం ఎంతవరకు సమంజసం? హెచ్చరిక వ్యవస్థ ఉద్దేశం కొనుగోలును ఆపడం కాదు. సమాచారాన్ని దాచకుండా నిర్ణయం తీసుకునే అవకాశం ఇవ్వడం. కాబట్టి ఏ పోషకం అధికంగా ఉందో అది స్పష్టంగా కనిపించాలన్నదే సహేతుకమైన డిమాండ్.**

### చిలీ అనుభవం చెప్పేది ఇదే

ప్యాకెట్ ముందు భాగంలో అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు వంటి అంశాలను స్పష్టంగా చూపించే హెచ్చరిక విధానాలను కొన్ని దేశాలు ఇప్పటికే అమలు చేస్తున్నాయి. చిలీ విధానం ఈ చర్చలో తరచుగా ఉదాహరణగా వస్తోంది. అలాంటి విధానం ఉత్పత్తిని నిషేధించదు. కొనుగోలు చేసే ముందు వినియోగదారుడికి ఒక క్షణం ఆలోచించే అవకాశం ఇస్తుంది. ప్యాకెట్ ఆకర్షణ ఒకవైపు, ప్రకటన మరోవైపు, బ్రాండ్ నమ్మకం ఇంకోవైపు ఉన్నప్పుడు.. ఆహారంలో ఉన్న ప్రమాదం కూడా వినియోగదారుడి కంటికి కనిపించాలి.

### కఠినత ఉండాలి.. కానీ న్యాయమైన అమలుతో

ఆహార కల్తీ, భద్రతా ఉల్లంఘనలపై మహారాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు మద్దతు ఇస్తోంది. అదే సమయంలో చట్టబద్ధంగా వ్యాపారం చేస్తున్న వారికి స్పష్టమైన మార్గదర్శకాలు, నిబంధనలను అమలు చేసేందుకు తగిన అవకాశం ఇవ్వాల్సిన అవసరాన్ని కూడా ప్రభుత్వం ప్రస్తావిస్తోంది. ఇది పరస్పర విరుద్ధమైన అంశం కాదు. తప్పు చేసినవారిపై చర్య ఉండాలి. చట్టబద్ధంగా నడిచేవారికి స్పష్టత ఉండాలి. వినియోగదారుడికి మాత్రం నిజమైన సమాచారం ఉండాలి. కఠినమైన నియంత్రణకు తోడు న్యాయమైన అమలే సమర్థవంతమైన ఆహార భద్రత వ్యవస్థకు పునాది.

### ఒకే బ్రాండ్.. దేశాన్ని బట్టి వేర్వేరు ప్రమాణాలా?

**అంతర్జాతీయ సంస్థల ప్యాకెట్ ఆహారాల విషయంలో మరో చర్చ కూడా ఉంది. ఒకే బ్రాండ్ ఉత్పత్తిలో దేశాన్ని బట్టి చక్కెర, ఉప్పు, కొవ్వు వంటి పోషకాల స్థాయిలు మారుతున్నాయా? వేర్వేరు దేశాల్లో వేర్వేరు ప్రమాణాలు ఎందుకు? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దేశానికో ఆహార నియమం ఉండొచ్చు. స్థానిక రుచులు, ముడిసరుకులు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తిలో మార్పులు ఉండొచ్చు. దానిని మాత్రమే తప్పుగా చూడలేం. కానీ ఏ దేశంలో విక్రయించినా వినియోగదారుడికి నిజమైన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత మాత్రం ఒకటే ఉండాలి. అదే పారదర్శకత. అదే ఆహార పరిశ్రమకు ఉండాల్సిన కనీస నైతిక ప్రమాణం.**

### బాధ్యత చివరికి ఎవరిది?

కంపెనీదా? కేంద్ర ఆహార నియంత్రణ సంస్థదా? రాష్ట్ర శాఖదా? గోడౌన్ నిర్వాహకుడిదా? వ్యాపారిదా? నిజానికి అందరిదీ. కానీ వీరిలో చివరికి ప్రమాదాన్ని ఎదుర్కొనేది మాత్రం వినియోగదారుడే. అందుకే తయారీ కేంద్రం నుంచి గోడౌన్ వరకు, గోడౌన్ నుంచి దుకాణం వరకు, అక్కడి నుంచి వినియోగదారుడి చేతికి చేరే వరకు ఉత్పత్తి ప్రయాణాన్ని గుర్తించగలిగే వ్యవస్థ అవసరం. ఎక్కడ తయారైంది? ఎప్పుడు తయారైంది? ఎక్కడ నిల్వ చేశారు? ఎవరి ద్వారా మార్కెట్‌కు వచ్చింది? లేబుల్‌లో మార్పు ఎక్కడ జరిగింది? వంటి ప్రశ్నలకు సమాధానం వెంటనే దొరికే వ్యవస్థ ఉంటేనే నకిలీ లేబుళ్లు, గడువు తేదీ మార్పులు, కల్తీ వంటి వాటిని సమర్థంగా అరికట్టగలం.

### ప్యాకెట్ రంగు కాదు.. నిజం కనిపించాలి

వినియోగదారుడికి కావాల్సింది భయపెట్టే ప్రచారం కాదు. నిజమైన సమాచారం. ఏ ఉత్పత్తిలో ఎంత చక్కెర ఉంది? ఎంత ఉప్పు ఉంది? ఎంత సంతృప్త కొవ్వు ఉంది? తయారీ తేదీ ఏమిటి? గడువు ఎప్పుడు ముగుస్తుంది? ప్యాకెట్‌పై ఉన్న ప్రతి సమాచారం నిజమేనా? ఇవన్నీ తెలుసుకున్న తర్వాత కొనాలా వద్దా అన్న నిర్ణయం వినియోగదారుడిదే కావాలి. ఆ నిర్ణయం తీసుకునే హక్కును కాపాడాల్సిన బాధ్యత మాత్రం వినియోగదారుడిపై మోపలేం. ప్యాకెట్‌పై అందమైన చిత్రం ఉండటం ముఖ్యం కాదు. అందులోని ఆహారం సురక్షితంగా ఉండటం ముఖ్యం. బ్రాండ్ పేరు పెద్దగా కనిపించడం ముఖ్యం కాదు. పోషక సమాచారం నిజంగా ఉండటం ముఖ్యం. గడువు తేదీ ముద్రించడం మాత్రమే కాదు.. ఆ తేదీని ఎవరూ మార్చలేని వ్యవస్థ ఉండటం ముఖ్యం. సుప్రీంకోర్టు ప్రశ్నలు, ఆహార నియంత్రణ సంస్థ ప్రతిపాదనలు, మహారాష్ట్రలో తుకారాం ముండే నేతృత్వంలోని దాడులు.. ఇవన్నీ ఒకే విషయాన్ని చెబుతున్నాయి. ఆహార భద్రత ప్యాకెట్ తయారైన చోట మొదలై.. వినియోగదారుడి ప్లేట్ వరకు కొనసాగాలి. అంతిమంగా ప్రశ్న ఒక్కటే. మన పిల్లల చేతిలోకి వెళ్లే ప్యాకెట్‌ను నమ్మడానికి ముందు.. దాన్ని నమ్మదగినదిగా మార్చాల్సిన బాధ్యత ఎవరిది? అదే ప్రభుత్వానికి ఎదురైన అసలు పరీక్ష. అదే నియంత్రణ సంస్థలకు ఎదురైన అసలు బాధ్యత. అదే ఆహార పరిశ్రమకు ఎదురైన అసలు నైతిక ప్రశ్న. ఎందుకంటే ప్యాకెట్ ఒక వస్తువు మాత్రమే కాదు.. దాని లోపల ఉన్నది మన ఆరోగ్యం. ఆ ప్యాకెట్‌ను నమ్మి తినేది మన పిల్లలు కూడా.

సాయి మణికంఠ చికోటి
మేనేజింగ్ ఎడిటర్ - నవజ్యోతి తెలుగు దినపత్రిక

## హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ వినతి




కామారెడ్డి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల అసిస్టెంట్ కలెక్టర్ వై.ఎన్.గిరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హఫీజ్, కోఆప్షన్ సభ్యుడు కుంభాల రవి యాదవ్, ప్రభాకర్ యాదవ్, పిట్ల వేణు, గెరిగంటి స్వప్న, లక్ష్మీనారాయణ, మామిండ్ల లక్ష్మణ్, గోపు బాలమణి నర్సింహులు, మన్సూర్, లోలం శ్రీనివాస్, ఎజాజ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 420 హామీలపై ప్రజావాణిలో ఫిర్యాదు.. పైలాన్ పరిరక్షణకు వినతి

**- ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు, పోలీసుల తీరుకు నిరసనగా బిక్కనూర్‌లో రాస్తారోకో**



బిక్కనూర్, సెప్టెంబర్ 07 (నవజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం బిక్కనూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. హామీలను అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పైలాన్‌పై ఫ్లెక్సీలు, స్టిక్కర్లకు అడ్డుకట్ట వేయాలిబిక్కనూర్ డివైడర్ వద్ద నిర్మించిన పైలాన్‌పై ప్రైవేటు వ్యక్తులు, ప్రజాప్రతినిధులు ఫ్లెక్సీలు, స్టిక్కర్లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. పైలాన్‌ను శుభ్రంగా ఉంచడంతో పాటు, ఇందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ ఘటనకు నిరసనగా రాస్తారోకోఅసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితర బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపిస్తూ కేటీఆర్, గంప గోవర్ధన్ పిలుపు మేరకు బిక్కనూర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట కామారెడ్డి రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడులు, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అత్తిల్లి శ్రీనివాస్, బిక్కనూర్ మాజీ సర్పంచ్ తునికి వేణు, నాయకులు అందే మహేందర్‌రెడ్డి, రామచంద్రం, పెద్దమల్లారెడ్డి సర్పంచ్ సాయిగౌడ్, జంగంపల్లి సర్పంచ్, బస్వాపూర్ ఉపసర్పంచ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క 112 కాల్‌తో
# తప్పిన పెను విషాదం




**బిడ్డతో వెళ్లిన మహిళను కాపాడిన దోమకొండ పోలీసులు**

కామారెడ్డి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై చిన్నారితో ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళను దోమకొండ పోలీసులు సకాలంలో గుర్తించి కాపాడారు. భార్యాభర్తల మధ్య గొడవ అనంతరం మహిళ ఆత్మహత్యకు పాల్పడే ప్రమాదం ఉందని కుటుంబ సభ్యులు డయల్-112కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పెట్రోల్ కార్ సిబ్బంది కానిస్టేబుల్ సాయిబాబా, హోంగార్డు రాజు గాలింపు చేపట్టి గుండ్ల చెరువు కట్ట సమీపంలో మహిళను బిడ్డతో గుర్తించారు. ఆమెను సముదాయించి కౌన్సెలింగ్ ఇచ్చి భర్త, అత్తకు సురక్షితంగా అప్పగించారు. సకాలంలో స్పందించి తల్లీబిడ్డలను కాపాడిన సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర అభినందించారు. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఆపదలో ఉన్నవారు వెంటనే 112కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

## హామీల కోసం హోరు..
# కొంపల్లిలో బీఆర్ఎస్ నిరసన




**- వినతి పత్రం సమర్పణ.. సీఎం దిష్టిబొమ్మ దహనం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులకు నిరసనగా ఆందోళన**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):**


కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొంపల్లి సర్కిల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టుకు నిరసనగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎనిమిది రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ డీసీ లావణ్యకు వినతి పత్రం సమర్పించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ ఆదేశాల మేరకు 292 డివిజన్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, పోలే శ్రీకాంత్, రాజ్‌కుమార్ ముదిరాజ్, తారా సింగ్, గట్టు అశోక్, భాస్కర్, రాజు యాదవ్, రంగప్ప, బద్రి, వేణు ముదిరాజ్, సత్యనారాయణ గౌడ్, పూర్ణచందర్ రెడ్డి, కిషోర్ ముదిరాజ్, నరసింహ గౌడ్, జైసింహా రెడ్డి, జహీర్, మునీర్, కైసర్ పాషా, మజీద్ పాషాతో పాటు బస్తీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

## అరుణాచలేశ్వరుడిని దర్శించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



కామారెడ్డి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ గిరి ప్రదక్షిణ చేసి అరుణాచలేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, పోచమ్మల శ్రీనివాస్, అర్చకుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం



బిక్కనూరు, సెప్టెంబర్ 07 (నవజ్యోతి ప్రతినిధి): బిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహాలను సోమవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా చూడాలని కోరారు. ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాసు వాణి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిల కోసం పోరాటం.. హౌస్ అరెస్ట్!



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన 'ఫీజుల బకాయిల బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో దుండిగల్ సర్కిల్ బౌరంపేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డిని దుండిగల్ పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేసినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ఇంటి వద్దే నిర్బంధించారని కృష్ణారెడ్డి ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అణచివేస్తోందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన నిర్బంధ విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆరోపించారు.

# పచ్చని భవిష్యత్తుకు మొక్కలే పెట్టుబడి




కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా దుండిగల్ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరన్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా భావితరాలకు మెరుగైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యుబిడి మేనేజర్ రఘువీర్ రెడ్డి, టీపీఎస్ ముకేష్ సింగ్, ఏఎంసీ లక్ష్మయ్యతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం అందించాలి: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించి ఫిర్యాదులు అందగా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా సమగ్ర విచారణ చేపట్టి, పురోగతిని ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని, అధికారులు పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు.

## మంటల్లో కారు.. లోపల కాలిపోయిన కార్తీక్!



**- బౌరంపేట ఓపెన్ ఏరియాలో ఉదయాన్నే కలకలం ఆత్మహత్యేనా..?**
**- మరేదైనా కోణమా..? పోలీసుల దర్యాప్తు**

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బౌరంపేటలో సోమవారం ఉదయం కారులో వ్యక్తి సజీవదహనమైన ఘటన కలకలం రేపింది. రుద్ర కన్స్ట్రక్షన్స్ సమీపంలోని ఓపెన్ ఏరియాలో ఉదయం 7 గంటల సమయంలో కారు మంటల్లో కాలిపోతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో కాలిపోయిన మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు మృతుడిని బౌరంపేట ప్రణీత్ ప్రణవ్ విలాస్‌కు చెందిన కార్తీక్ (40), తండ్రి రాధాకృష్ణగా గుర్తించారు. కార్తీక్ లాండ్రీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన భార్య రెండున్నరేళ్లుగా దూరంగా ఉంటుండగా, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు ప్రాథమికంగా తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఆత్మహత్య కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతికి ఖచ్చితమైన కారణం దర్యాప్తు పూర్తయిన తర్వాతే వెల్లడవుతుందని పోలీసులు తెలిపారు.

## రోడ్డెక్కిన కాలనీ సమస్యలు.. ప్రజావాణి బాట పట్టిన సూరారం!



**- డ్రైనేజీ లేదు.. విద్యుత్ వైర్లతో ప్రమాదం.. సమస్యల పరిష్కారానికి వినతి**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):**

**సాయిబాబానగర్ 292వ డివిజన్ పరిధిలోని సూరారం రాజీవ్ గృహకల్ప బ్లాక్ 1 నుంచి 14 వరకు నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ వైర్లు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను స్థానికులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను ఇప్పటికే ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. సమస్యలపై సోమవారం ప్రజావాణిలో డీసీ లావణ్య, విరాట్‌కు వినతిపత్రం అందజేసి తక్షణ పరిష్కారం కోరారు. పాదయాత్రలో రాజ్‌కుమార్ ముదిరాజ్, తారా సింగ్, గట్టు అశోక్, భాస్కర్, రాజు యాదవ్, రంగప్ప, బద్రి, వేణు ముదిరాజ్, సత్యనారాయణ గౌడ్, పూర్ణచందర్ రెడ్డి, కిషోర్ ముదిరాజ్, నరసింహ గౌడ్, జైసింహ రెడ్డి, మునీర్, జహీర్, కైసర్ పాషా, మజీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.**

# 75 ఏళ్ల సాగుకు న్యాయం ఎక్కడ?



**- 32 ఎకరాలు స్వాధీనం.. 100 దళిత కుటుంబాల జీవనోపాధిపై ప్రశ్నార్థకం**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):**

బౌరంపేట్ సర్వే నంబర్ 472లోని అసైన్మెంట్ భూమిలో దళితులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ ఆధ్వర్యంలో సోమవారం దుండిగల్-గండిమైసమ్మ మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 75 ఏళ్లుగా ఈ భూమిపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్న దళిత కుటుంబాలకు పునరావాసం కల్పించకుండా 32 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో సుమారు 100 కుటుంబాల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని మంగమ్మ అన్నారు. దుండిగల్ ప్రాంతంలో అసైనీలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలాలు కేటాయిస్తున్న విధంగానే బౌరంపేట్ దళితులకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేయగా, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో డప్పు కృష్ణ, బాలగారి నరసింహ, కొమ్ము యాదయ్య, చింతకింది రమేష్, చింతకింది ముత్తమ్మ, కొమ్ము వీరయ్య, బాలగారి మల్లేష్, చింతకింది రాములమ్మ, అగ్రి నరసింహతో పాటు పలువురు దళితులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మెల్లూరు సర్పంచ్ రంగారెడ్డి



**వెల్దుర్తి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్):**

శేరిలా గ్రామంలో పొలంలో గడ్డి కోస్తుండగా బుష్‌కట్టర్ విద్యుత్ వైర్‌కు తగిలి మృతి చెందిన యువ రైతు మిర్జాపల్లి రఘుపతి కుటుంబాన్ని మెల్లూరు సర్పంచ్ రంగారెడ్డి పరామర్శించారు. కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రఘుపతి మృతి బాధాకరమని, కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భక్తుల నవీన్, బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు చల్ల మహేష్ యాదవ్, దగ్గుల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేకనే ఆరోపణలు

**- మంత్రిగా పనిచేసిన సునీతారెడ్డి నర్సాపూర్‌కు చేసింది ఏముంది?**
**- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎం.ఏ. హకీం**

హత్నూర, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):

పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ. హకీం అన్నారు. సోమవారం దౌల్తాబాద్-కాసాల చౌరస్తాలో తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హకీం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రిగా పనిచేసిన సునీతారెడ్డి నర్సాపూర్‌కు ఏం చేశారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు సొంతింటి కల నెరవేరుతోందని, గత బీఆర్ఎస్ పాలనలో పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందలేదని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాజేందర్, సర్పంచులు గంగారెడ్డి, శ్రీహరి, యాదగిరి, నాయకులు కొన్యాల వెంకటేశం, నరసింహారెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివ, భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం నర్సాపూర్‌లో నిర్వహించిన విజయోత్సవ సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు.

# ధ్యానంతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం



**నడిగూడెం, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్):**

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని తహసీల్దార్ ఎల్. మంగ అన్నారు. సోమవారం వల్లాపురం-జక్కేపల్లి సరిహద్దులోని గరుడ పిరమిడ్‌లో నిర్వహించిన ధ్యాన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిత్యజీవితంలోని ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడంతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచేందుకు ధ్యానం దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ దినచర్యలో ధ్యానాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై తేజస్విని, సీనియర్ పిరమిడ్ మాస్టర్ అచ్చిరెడ్డి, పెద్ద సంఖ్యలో ధ్యానులు పాల్గొన్నారు.



# గ్యారంటీల అమలుకు బీఆర్ఎస్ డిమాండ్

ప్రజావాణిలో దరఖాస్తులు.. నిజాంసాగర్‌లో ధర్నా

జుక్కల్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. వారం రోజుల నిరసనల్లో భాగంగా సోమవారం నిజాంసాగర్‌లో ప్రజావాణిలో దరఖాస్తులు అందజేసి, అనంతరం పాత బస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. సీడీసీ మాజీ చైర్మన్ పట్లోళ్ల దుర్గారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో శివకృష్ణ, తహసీల్దార్ సాయిబుజంగారావులకు దరఖాస్తులు అందజేసి, పింఛన్ల పెంపుతో పాటు మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ఆనంద్‌కుమార్, అంజయ్య, విజయ్‌కుమార్, రాజు, లింగగౌడ్, విఠల్‌గౌడ్, గోరేమియా, పండరి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్‌లోనూ.. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ లత, ఎంపీడీవో అనితకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, ధపెదర్ విజయ్, మహేందర్, రాంచందర్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చివరి శ్రావణ సోమవారం.. సిద్ధిరామేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



**- బిక్కనూర్ సిద్ధిరామేశ్వరాలయంలో వేలాదిగా భక్తుల రద్దీ**

బిక్కనూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):

దక్షిణ కాశిగా పేరొందిన బిక్కనూర్ సిద్ధిరామేశ్వరాలయం చివరి శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకోగా, గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మూలభావి వద్ద తలస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

దర్శనంలో ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు చేయగా, పలు పాఠశాలల విద్యార్థులు వాలంటీర్లుగా సేవలందించారు. భక్తులకు అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

# కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తుంది



హత్నూర, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):

ఎమ్మెల్యే సునీతారెడ్డిపై అసెంబ్లీలో పోలీసులు వ్యవహరించిన తీరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు హత్నూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.

సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'సమరభేరి' కార్యక్రమం నిర్వహించి, ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యే సునీతారెడ్డిని పోలీసులు అవమానించడం దారుణమని ఆరోపించారు. వెయ్యి రోజుల పాలనలో హామీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. హామీల అమలు కోసం తాము నిరసనలు చేపడుతుంటే ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని ఆరోపించారు.

అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింలు, మాజీ జెడ్పీటీసీ ఆంజనేయులు, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రావు, సర్పంచులు ఎల్లయ్య, నవీన్‌గౌడ్, ప్రమీల, శోభారాణి, మల్లేశం, రాయుడు, నాయకులు రవి, మధు, వీరేశంగౌడ్, రమేష్, నర్సింలు, మేరాజ్, అర్జున్, శ్రీకాంత్, అజ్మత్‌అలీ, రవీందర్ నాయక్, వెంకట్‌రెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన.. ఉద్రిక్తత

**- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులకు నిరసనగా రోడ్డుపై బైఠాయింపు**

మేడ్చల్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):

అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మేడ్చల్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీలో ప్రభుత్వ పాలనను ప్రశ్నిస్తారనే భయంతోనే ఎమ్మెల్యేలను ముందస్తుగా అరెస్టు చేసి నిర్బంధించారని నేతలు ఆరోపించారు. హామీలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్‌పై కక్షపూరిత కేసులతో అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. జాతీయ రహదారిపై ఆందోళనకు దిగిన వారిని మేడ్చల్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, చైర్మన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కుత్బుల్లాపూర్ జోన్ జట్టులో చోటు కోసం హోరాహోరీ

170 మంది.. ఒక్క అవకాశం.. సత్తా కోసం సమరం అండర్-14, అండర్-17 క్రికెట్ జోనల్ ఎంపికలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): బౌరంపేట్‌లోని కార్తికేయ క్రికెట్ గ్రౌండ్స్‌లో అండర్-14, అండర్-17 బాలుర క్రికెట్ జోనల్ స్థాయి ఎంపికలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 170 మంది క్రీడాకారులు పాల్గొని బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో తమ ప్రతిభను ప్రదర్శించారు. కుత్బుల్లాపూర్ ఎస్‌జీఎఫ్ జోనల్ కార్యదర్శి పి. నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను పరిశీలించి తదుపరి స్థాయి పోటీలకు అర్హులను ఎంపిక చేశారు. పీడీలు వినోద్, విజయ్, రమేష్, సురేష్, సునీల్ తదితరులు ఎంపికల నిర్వహణలో సహకరించారు.

# ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యం

బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు కొత్త సర్వీసులపై దృష్టి
ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్

సంగారెడ్డి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి) :

ప్రయాణికులను సురక్షితంగా, క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చడమే తెలంగాణ ఆర్టీసీ ప్రధాన లక్ష్యమని ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేని ప్రాంతాలను గుర్తించి, ప్రయాణికుల అవసరాలు, ఆదరణకు అనుగుణంగా కొత్త సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికుల రద్దీ, ఆదాయం ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరానికి అనుగుణంగా అదనపు బస్సులు నడిపేందుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రజలు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని కోరారు. నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఇటీవల హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా కాపాడి అనంతరం గుండెపోటుతో మృతి చెందడం అత్యంత బాధాకరమని మధుసూదన్ పేర్కొన్నారు. క్లిష్ట సమయంలోనూ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చిన డ్రైవర్ సేవలను గుర్తుచేశారు.



# వంతెన కోసం గళమెత్తితే.. పోలీసుల అడ్డంకులా?



ఘట్కేసర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):

ఘట్కేసర్ వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఉద్రిక్తత నెలకొంది. ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేయడానికి ప్రయత్నించగా చిక్కడపల్లి పోలీసులు అడ్డుకునేందుకు, అరెస్టు చేసేందుకు ప్రయత్నించారని బీజేపీ నాయకులు ఆరోపించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. వంతెన నిర్మాణం ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సుదర్శన్‌రెడ్డి అన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ జీ. వనజను కలిసి వంతెన నిర్మాణం వేగవంతం చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంగు రాధిక, మాధవి, అనిల్‌గౌడ్, కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, సురేందర్, బండ్లగూడ కిషోర్, కమలాకర్, బండారు పవన్‌రెడ్డి, శివనాయక్, అజయ్‌యాదవ్, బాలు యాదవ్, గుండె నరేష్, వీరారెడ్డి, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్‌కు పార్కింగ్ గ్రహణం.. సూరారం సిగ్నల్‌కు ట్రాఫిక్ శాపం!



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):

సూరారం సిగ్నల్ సమీపంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఒకవైపు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, మరోవైపు ఫుట్‌పాత్‌లు, రోడ్డు అంచులపై వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నర్సాపూర్-బాలానగర్ ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే వాహనాలను ఫుట్‌పాత్‌లపై నిలిపివేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో పాదచారులు రోడ్డుపైనే నడవాల్సి వస్తుండటంతో ప్రమాదాల భయం నెలకొంది. డ్రైనేజీ పనులతో రహదారి మార్గం తగ్గిన నేపథ్యంలో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ మరింత మందగిస్తోంది. ఫుట్‌పాత్‌లను పాదచారులకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అక్రమ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## డీవైఎఫ్ఐ సూర్యాపేట జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయండి



నడిగూడెం, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్):

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నాయని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి కేసగాని భద్రయ్య విమర్శించారు. ఈ నెల 8న జరగనున్న డీవైఎఫ్ఐ సూర్యాపేట జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. జీవో 97తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థినులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా విస్మరించిందన్నారు. యువత తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, జిల్లా నలుమూలల నుంచి యువతీ యువకులు తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని భద్రయ్య కోరారు.

## ఏబీవీపీ మెదక్ జిల్లా
# కన్వీనర్‌గా బండారి ప్రశాంత్



**రామాయంపేట, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):**

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఈ నెల 5, 6 తేదీల్లో ఖమ్మం జిల్లాలో నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఏబీవీపీ మెదక్ జిల్లా కన్వీనర్‌గా బండారి ప్రశాంత్‌ను రాష్ట్ర అధ్యక్షుడు రావుల కృష్ణ నియమించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలు, హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మెదక్ జిల్లాలో విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.

## నూతన వధూవరులకు
## కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు అందజేత





రామాయంపేట, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): రామాయంపేట మండలం దంతేపల్లి గ్రామానికి చెందిన సుజాత కృష్ణ కుమార్తె కళ్యాణి వివాహం సందర్భంగా కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో నూతన వధూవరులకు పుస్తెమెట్టెలు అందజేశారు. పాడి రైతుల సంక్షేమం, కుటుంబ శుభకార్యాల్లో అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు డెయిరీ మేనేజర్ పడకంటి సాయి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మిద్దె అశోక్, డెయిరీ డైరెక్టర్, అధ్యక్షుడు, స్థానిక పాడి రైతులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. పాడి రైతులు డెయిరీ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యమైన పాలు అందిస్తూ డెయిరీ అభివృద్ధికి సహకరించాలని సాయికుమార్ కోరారు.

## యూరియా కోసం రైతుల అవస్థలు..
## పోలీసు బందోబస్తు మధ్య సరఫరా!



రామాయంపేట, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): M రామాయంపేట పీఏసీఎస్‌లో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా వచ్చిన ప్రతిసారీ బుకింగ్ కోసం తిప్పలు పడాల్సి వస్తోందని, పోలీసు బందోబస్తు మధ్య సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు, స్థానికులు తెలిపారు. సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. యూరియా బస్తా ధర రూ.266 కాగా, రవాణా ఖర్చుల పేరుతో అదనంగా రూ.34 వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. యూరియా సరఫరా, బుకింగ్ విధానం, అదనపు వసూళ్లపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు

# వసూళ్లకు చెక్.. ట్రాన్స్‌జెండర్లకు పోలీసుల వార్నింగ్






షాపుల ప్రారంభోత్సవాలు, శుభకార్యాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

కూకట్‌పల్లి-కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధులు నవీన్ మహేష్):

షాపుల ప్రారంభోత్సవాలు, గృహప్రవేశాలు, శుభకార్యాలు, పండుగల పేరుతో వ్యాపారులు, ప్రజలను బెదిరించి బలవంతపు వసూళ్లకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కేపీహెచ్‌బీ, జీడిమెట్ల పోలీసులు హెచ్చరించారు. గాజులరామారం బాలాజీలేఅవుట్‌లోని ఓ సెలూన్ ప్రారంభోత్సవంలో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు యజమానిని డబ్బులు డిమాండ్ చేసి, ఇవ్వకపోతే తమ వర్గీయులతో వచ్చి ఇబ్బందులు సృష్టిస్తామని బెదిరించిన ఘటనపై జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఎక్స్‌టార్షన్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులతో పోలీసులు సమావేశాలు నిర్వహించి కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రివేళల్లో ప్రధాన రహదారులు, దుకాణాల వద్ద వాహనదారులను అడ్డుకోవడం, దురుసుగా ప్రవర్తించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఎలాంటి మినహాయింపు లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జీడిమెట్ల ఎస్‌హెచ్ఓ కె. రవికుమార్ హెచ్చరించారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం

**నడిగూడెం, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్):**

బీజేపీ నడిగూడెం మండల మాజీ ఉపాధ్యక్షుడు షేక్ లతీఫ్ మృతి విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బండారు కవితారెడ్డి సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయం అందించి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండారు వీరబాబు యాదవ్, కోదాడ టౌన్ అధ్యక్షుడు గోదేశి లక్ష్మణ్, అనంతగిరి మండల అధ్యక్షుడు చింతకుంట్ల సతీష్, మండల ప్రధాన కార్యదర్శి కేశగాని పాపయ్య, ఉపాధ్యక్షులు ముప్పా నర్సింహారావు, బీరవెల్లి గోపాల్‌రెడ్డి, కార్యదర్శి రవి, రెడ్డిపల్లి రాముడు తదితరులు పాల్గొన్నారు.



# జగద్గిరిగుట్ట పోలీసుల జోరు..
# రెండు రోజుల్లో ఐదు కేసులు ఛేదన!

రూ.9 లక్షల నగదు.. 3.5 తులాల బంగారం.. రూ.10 లక్షల బ్యాటరీలు రికవరీ

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): జగద్గిరిగుట్ట పోలీసులు రెండు రోజుల్లో ఐదు కేసులను ఛేదించి పలువురు నిందితులను అరెస్ట్ చేశారు. మోసం కేసులో రూ.9 లక్షల నగదు, 3.5 తులాల బంగారం, ఇళ్ల దొంగతనాల కేసులో మొబైల్‌ఫోన్, బంగారం, వెండి వస్తువులు, రూ.60 వేల నగదు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌లో చోరీకి గురైన రూ.10 లక్షల విలువైన నాలుగు బ్యాటరీలను రికవరీ చేశారు. మోసం కేసులో కామినెడ్డి శివమోహన్‌రెడ్డి, ఇళ్ల దొంగతనాల కేసులో గరికపాటి వెంకటేష్, బ్యాటరీల చోరీ కేసులో తోట గురువప్పను అరెస్ట్ చేశారు. శివమోహన్‌రెడ్డి గతంలో ఎస్ఎస్‌బీలో కానిస్టేబుల్‌గా పనిచేసి, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటై మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. డీసీపీ ఆదేశాల మేరకు ఏసీపీ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను ఛేదించిన సీఐ సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్రరెడ్డి, ఏఎస్సై రామ్‌కుమార్, పీసీలు నరేష్‌గౌడ్, రమేష్, డబ్ల్యూపీసీ సుమను ఉన్నతాధికారులు అభినందించి రివార్డులతో సత్కరించారు.




# ప్రజల కష్టాలే తన కష్టంగా
# భావిస్తూ నిత్యం ప్రజాసేవ

తండ్రి జ్ఞాపకార్థం పంచాయతీకి వైకుంఠ రథం బహూకరణ

మనోహరాబాద్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి నవీన్): ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర నాయకుడు చిట్కూల మహిపాల్‌రెడ్డి తన తండ్రి చిట్కూల రామ్‌రెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా లక్ష్మీ రామ్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మనోహరాబాద్ గ్రామపంచాయతీకి వైకుంఠ రథాన్ని బహూకరించారు. సోమవారం ఎంపీడీవో కృష్ణమూర్తి సమక్షంలో పంచాయతీ కార్యదర్శికి వాహనాన్ని అందజేశారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం లక్ష్మీ రామ్‌రెడ్డి ట్రస్టు, సీఎంఆర్ బృందం ఆధ్వర్యంలో పేదలు, విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి,




మల్లారెడ్డి, జావీద్ పాషా, నితిన్‌రెడ్డి, పార్టీ నాయకులు, అభిమానులు, సీఎంఆర్ బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి
# పేదల పాలిట వరం



**మేడ్చల్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):**

గుండ్లపోచంపల్లి 299వ డివిజన్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు బాధితులకు అందజేశారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారి నరేందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంపత్‌గౌడ్, కావలి భాస్కర్, ఆలయ కమిటీ డైరెక్టర్లు ఉదయ్‌గౌడ్, అనిల్ ముదిరాజ్, సోను, షబ్బీర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు..
## ప్రజాస్వామ్యంలో ఇదెక్కడి న్యాయం?




చేగుంట, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్):

హైదరాబాద్ అసెంబ్లీ ఎదుట కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని చేగుంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి అన్నారు. సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ 420 హామీలతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని, తన వైఖరి మార్చుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎదుట మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. మహిళా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మాజీ మంత్రుల అరెస్టుకు
## నిరసనగా బీఆర్ఎస్ రాస్తారోకో






పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి.. ప్రజావాణిలో మాజీ సర్పంచ్ వినతి

మాడుగులపల్లి, సెప్టెంబర్ 6 (నవజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తన్నీరు హరీశ్‌రావుల అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండిస్తూ రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకుని ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇదిలా ఉండగా బొమ్మకల్ మాజీ సర్పంచ్ మారుతి వెంకటరెడ్డి తన పదవీకాలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2019-2024 మధ్య పూర్తిచేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, రికార్డులు పరిశీలించి బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాలుట్ల బాబయ్య, నిమ్మల నవీన్‌రెడ్డి, కందిమల్ల నరేందర్‌రెడ్డి, జేరిపోతుల రాములుగౌడ్, పోకల రాజు, మారుతి వెంకటరెడ్డి, కాసిం, గోవిందరెడ్డి, ఏడుకొండలు, శ్రీనివాసు, చంటి, రాబర్ట్, సైదులు, రామకృష్ణ, అంజయ్య, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు జీవన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి




**- జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్పా రామారావు**

మిర్యాలగూడ, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలంటే పాఠ్యాంశాలతో పాటు జీవన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్పా రామారావు అన్నారు. కేవీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీవన నైపుణ్యాలు, రాజ్యాంగంపై నిర్వహించిన చర్చాగోష్టిలో సామాజికవేత్త డాక్టర్ రాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. దేశ పరిస్థితులను అర్థం చేసుకుని నిరంతరం కష్టపడి చదవాలని సూచించారు. అంబేద్కర్ ఉన్నత విద్య అభ్యసించి గొప్ప మేధావిగా ఎదిగారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివకృష్ణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల స్థలాన్ని కాపాడాలి



మేడ్చల్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):
పూడూరు-కిష్టాపూర్ కార్పొరేషన్ పరిధిలోని కిష్టాపూర్‌లో గురుకుల పాఠశాలకు కేటాయించిన సర్వే నంబర్ 786లోని ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ ఆరోపించారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భూమిపై తక్షణమే విచారణ జరిపి హద్దులు ఏర్పాటు చేసి, కబ్జా ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. విద్యాసంస్థలకు కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురైతే విద్యార్థులకు నష్టం జరుగుతుందని, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# మేడ్చల్ ప్రభుత్వ బాలుర పాఠశాలకు రూ.12 కోట్ల నిధులు మంజూరు



విద్యావ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ ధ్యేయం: రెడ్డెంగారి నవీన్‌రెడ్డి

మేడ్చల్, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి):
రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రవేశ, ఫీజు నియంత్రణ కమిటీ సభ్యులు రెడ్డెంగారి నవీన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలకు 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' పథకం కింద రూ.12 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ నిర్ణయంపై నవీన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిధులతో పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపడి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కలుగుతుందని, పేద, గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ప్రైవేట్, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించడమే ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. పాఠశాలకు భారీగా నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి మేడ్చల్ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మేకపోతులు, బెల్లం బంగారంతో సమ్మక్క సారలమ్మకు భక్తుల మొక్కులు



**- శ్రావణమాస ఉపాసదీక్ష విరమణ సందర్భంగా ప్రత్యేక పూజలు**

బిక్కనూరు, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): శ్రావణమాస ఉపాసదీక్ష విరమణ సందర్భంగా కాచాపూర్ ఉపసర్పంచ్ బైండ్ల తోగరి దశరథం, కాంగ్రెస్ నాయకులు తోగరి లింగం, తోగరి నర్సింలు, జి. శ్రీనివాస్, ఎయిర్‌ఫోర్స్, కస్టమ్స్ కానిస్టేబుల్ తదితరులు సమ్మక్క సారలమ్మలను మేకపోతులు, బెల్లం బంగారంతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ధనధాన్యాలతో వర్ధిల్లాలని, విద్య, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవార్లను ప్రార్థిస్తూ దీక్షను విరమించారు.

# వెయ్యి రోజులు గడిచినా హామీలు అమలు కాలేదు




ప్రజావాణిలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నాయకులు

నడిగూడెం, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయినా ఎన్నికల హామీలు, ఆరు గ్యారంటీలు అమలు కాలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సూచనలతో సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో మన్సూర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండల సమన్వయ సమితి సభ్యుడు అనంతుల ఆంజనేయులు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గార్లపాటి శ్రీనివాసరెడ్డి, బోనగిరి ఉపేందర్, పోలంపల్లి వెంకటేశ్వర్లు, యలగొండ నాగేశ్వరరావు, నీలకంఠ వెంకన్న, దున్న మనిషా ప్రదీప్, ఎస్కే జలీల్, చిత్తలూరి రవి, రాజుల కృష్ణమూర్తి, దోసపాటి సతీష్, రెడ్డిపల్లి శ్రీను, విజయ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



రామాయంపేట, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను సకాలంలో విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు విమర్శించారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడిని పోలీసులు అడ్డుకుని నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న వారిని అరెస్టు చేయడం కాంగ్రెస్ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక విద్యార్థులు, కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్‌రెడ్డి, మండల అధ్యక్షులు నవీన్, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్యగారి యాదగిరి, నందిగామ సర్పంచ్ ఆకుల రమేష్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రంగయ్య, దంతపల్లి సర్పంచ్ బాలరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శేఖర్, మాజీ సర్పంచ్ వెనుముల సిద్ధరాములు, పట్టణ మాజీ అధ్యక్షులు భానుచందర్, కిసాన్ మోర్చా కార్యదర్శి ఏలగారి అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి అక్కల అనిల్, యువ మోర్చా నాయకులు భాష, అనిల్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం




కూకట్‌పల్లి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. భూములను 22ఏలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, హౌసింగ్ బోర్డు స్థలాలను వేలం వేస్తూ పేదలకు గజం భూమి కూడా దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులను నిరసిస్తూ సోమవారం కేపీహెచ్‌బీ కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, శిరీష బాబురావు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించే గొంతులను పోలీసులతో అణచివేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుకల్లో డీజేలకు అనుమతి లేదు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): కోర్టు నిబంధనల ప్రకారం వినాయక చవితి వేడుకల్లో డీజేలు, ప్యాడ్, బ్యాండ్ మ్యూజిక్‌పై కఠిన ఆంక్షలు ఉన్నాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఉత్సవాలను ప్రశాంతంగా, మత సామరస్యంతో నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. బాలానగర్ ఏసీపీ, డీఐ సక్రం, ఎస్సైలు హాజరై ఉత్సవాల నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. నిబంధనలను పాటిస్తూ వేడుకలు నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసుల అణచివేతకు నిరసనగా ఆందోళన



మిర్యాలగూడ, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులపై పోలీసులు అణచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ఆందోళన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి నల్ల బ్యాడ్జీలతో ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రతిపక్షాల గొంతును నొక్కేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.
కార్యక్రమంలో తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, అన్నబీమోజు నాగార్జునచారి, ఎం.డి. ఇలియాస్‌ఖాన్, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఎం.డి. మగ్దుం పాషా, ఎం.డి. మాజీద్, పద్మశెట్టి కోటేశ్వరరావు, గంగుల బిక్షం, రావూరి సుధాకర్, చంద్రశేఖరరావు, రవి, దుర్గాప్రసాద్, మట్టపల్లి సైదులు యాదవ్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యలు పరిష్కరించాలి

రామాయంపేట, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కె.సి.ఆర్. కాలనీలో సుమారు 250 కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించాలని 8వ వార్డు బీజేపీ కౌన్సిలర్ జంగంపల్లి శంకర్‌గౌడ్ కోరారు. సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలు పరిష్కరించాలని, పిచ్చిమొక్కలు తొలగించి దోమల నివారణకు మందులు పిచికారీ చేయాలని కోరారు. వీధిలైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజూ చెత్త సేకరణ చేపట్టాలని, ప్రధాన రహదారి వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

# బాధితురాలికి రూ.1.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి సహాయనిధి భరోసానిస్తోందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం కేపీహెచ్‌బీ డివిజన్‌కు చెందిన జి. పద్మజ అనారోగ్య చికిత్స కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1,10,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆమె భర్తకు ఎమ్మెల్యే అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబానికి అత్యవసర సమయంలో సాయం అందించిన ప్రభుత్వానికి బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

# హామీలు అమలు చేయలేదని ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతి



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శించాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు సూచనలతో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ సృజనకు వినతిపత్రం అందజేశారు. ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకే వినతి సమర్పించినట్లు తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ ప్రభుత్వానికి నివేదిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు, కొమిరిశెట్టి సాయిబాబా, బొబ్బ నవతారెడ్డి, రవియాదవ్, సంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రోజా, మమత, శ్రీకాంత్, శివరాజ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై 420 అడుగుల బాకీ కార్డుతో బీఆర్ఎస్ నిరసన




**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 7 (నవజ్యోతి ప్రతినిధి): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను రద్దు చేసి అన్ని రంగాల్లో సంక్షోభం సృష్టించిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. వసంత్‌నగర్ పరిసరాల్లో ప్రజల ఆస్తులను 22-ఏలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రజా అవసరాల భూములను వేల కోట్లకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనలతో మాజీ కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, పగడాల శిరీష బాబురావు ఆధ్వర్యంలో సోమవారం కేపీహెచ్‌బీలో నిరసన చేపట్టారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలును డిమాండ్ చేస్తూ 420 అడుగుల బాకీ కార్డుతో కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ నుంచి మూడో ఫేజ్ జయశంకర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రభాకర్ గౌడ్, నాయకులు శ్యామల రాజు, వెంకటేశ్వరరావు, పవన్‌కుమార్, మహిళా నేతలు అనిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.**

నవజ్యోతి
తెలుగు దినపత్రిక
navajyothidaily.com

## మారి సెల్వరాజ్ సినిమాలో
# పూర్ణిమ రవి.. కీలక పాత్రలో ఛాన్స్!



తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన శైలిని, గుర్తింపును సొంతం చేసుకున్న దర్శకుడు మారి సెల్వరాజ్ ప్రస్తుతం రెండు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఓవైపు ధనుష్‌తో 'డీ–56' చిత్రాన్ని తెరకెక్కిస్తూనే.. మరోవైపు విభిన్నమైన కాన్సెప్ట్‌తో 'మంజనతి' అనే సినిమాను పట్టాలెక్కించారు. లేడీ ఓరియెంటెడ్ ఎమోషనల్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీత దిగ్గజం ఇళయరాజా స్వరాలు అందిస్తుండటం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రియాంక మోహన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, కథిర్, పొన్‌వేల్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఫార్చ్యూన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సుశాంత్ ప్రసాద్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ ఆనంద వికటన్ వారపత్రికలో ప్రచురితమై విశేష ఆదరణ పొందిన ఓ సుప్రసిద్ధ ధారావాహిక ఆధారంగా మారి సెల్వరాజ్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడగా.. అప్పటి నుంచి సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతోంది. తాజాగా ఈ చిత్రానికి మరో ఆసక్తికరమైన చేరిక చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. యూట్యూబ్‌లో 'ఆరాత్తి' అనే కామెడీ ఛానెల్ ద్వారా డిజిటల్ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ తెచ్చుకున్న పూర్ణిమ రవి.. ఇప్పుడు 'మంజనతి'లో కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. యూట్యూబ్ వీడియోలతో గుర్తింపు తెచ్చుకున్న ఆమె ఆ తర్వాత షార్ట్ ఫిలిమ్స్‌లో నటిస్తూ తనలోని నటనా ప్రతిభను చాటుకున్నారు. బిగ్ బాస్ తమిళ సీజన్–7లో కంటెస్టెంట్‌గా పాల్గొని మరింత పాపులారిటీ సొంతం చేసుకున్నారు. 'ప్లాన్ పన్ని పణ్ణనుమ్', నయనతార నటించిన 'అన్నపూరణి', 'సెవప్పి' వంటి చిత్రాల్లో ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో నటించి మెప్పించారు. ఇప్పుడు ఏకంగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మంజనతి'లో అవకాశం దక్కించుకోవడంతో పూర్ణిమ రవి కెరీర్‌లో ఇది మరో కీలక మలుపుగా మారనుంది. ఆమె పాత్ర ఎలా ఉండబోతుంది? కథలో ఎలాంటి ప్రాధాన్యత కలిగి ఉంటుంది? అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు. దీంతో 'మంజనతి'తో పాటు పూర్ణిమ రవి పాత్రపైనా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

# చదువు పూర్తి చేయకపోవడం బాధిస్తోంది



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ కెరీర్‌లో ఎన్నో అద్భుతమైన విజయాలను సొంతం చేసుకున్నారు. ఇటీవల 'సింగం అగైన్'తో ప్రేక్షకులను అలరించిన ఆమె.. త్వరలో పృథ్వీరాజ్ సుకుమారన్‌తో కలిసి మేఘనా గుల్జార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న క్రైమ్ డ్రామా 'దాయరా'లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 18న ఈ చిత్రం థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో పాల్గొంటున్న కరీనా.. తాజాగా తన జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. కెరీర్‌లో ఎంతటి విజయాలు సాధించినప్పటికీ.. చిన్నతనంలో తీసుకున్న ఓ నిర్ణయం విషయంలో ఇప్పటికీ పశ్చాత్తాపపడుతు న్నానని ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కరీనా ఓపెన్ అయ్యారు. ముఖ్యంగా చదువు పూర్తి చేయక పోవడం తన జీవితంలో ఓ పెద్ద లోటుగా మిగిలిపోయిందని తెలిపారు. సినిమాల్లోకి వచ్చిన తర్వాత పూర్తిగా నటనపైనే దృష్టి పెట్టడంతో 11వ తరగతి తర్వాత తన చదువును మధ్యలోనే ఆపేయాల్సి వచ్చిం దని చెప్పారు. అప్పట్లో ఎవరైనా తన చదువు గురించి ప్రశ్నించినా, హేళన చేసినా.. ఒక నటిగా తనను తాను నిరూపించుకోవాలనే ఉద్దేశంతో తన మనసు చెప్పిన మాటనే విన్నానని కరీనా తెలిపారు. అయితే కాలం గడిచేకొద్దీ చదువు పూర్తి చేయలే కపోయాననే విషయం తనను ఇప్పటికీ బాధిస్తోం దని చెప్పారు. అందుకే తన కుమారులు ముందుగా చదువును పూర్తి చేసిన తర్వాతే తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవాలని స్పష్టంగా చెప్పినట్లు కరీనా వెల్లడించారు. భారత్‌లో బాలికల విద్యకు సంబంధించి ఐక్యరాజ్యసమితి ప్రచార కార్యక్రమం కోసం తనను సంప్రదించినప్పుడు.. ఈ లోటు కారణంగానే ఆ కార్యక్రమంలో భాగమయ్యేందు కు వెంటనే అంగీకరించానని ఆమె తెలిపారు. దీంతో కరీనా చేసిన ఈ ఎమోషనల్ కామెంట్స్ ప్రస్తుతం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి

## 'ది ప్యారడైజ్'లో నాని జడల్‌గా విధ్వంసం

ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి తన సహజమైన నటనతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నేచురల్ స్టార్ నాని.. నటుడిగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి నేటితో 18 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో విభిన్న కథలు, విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ తనకంటూ ఓ ప్రత్యేక బ్రాండ్‌ను సొంతం చేసుకున్న నాని.. ఈ ఏడాది 'ది ప్యారడైజ్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ అందించిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో మరోసారి నాని జతకట్టడంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. నాని, శ్రీకాంత్ ఓదెల కలయికలో వచ్చిన 'దసరా' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించడంతో.. ఇప్పుడు 'ది ప్యారడైజ్' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. నాని తన సినీ ప్రయాణంలో 18 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మేకర్స్ 'ది ప్యారడైజ్' నుంచి ఓ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. షూటింగ్‌కు సంబంధించిన ఆసక్తికర సన్నివేశాలతో పాటు నాని, చిత్రబృందం మధ్య చోటుచేసుకున్న సరదా, ఫన్నీ మూమెంట్స్‌ను కూడా ఈ వీడియోలో చూపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది.

## కెమెరా ముందుకెళ్లాకే అసలైన నటన మొదలవుతుంది

నేషనల్ అవార్డ్ విన్నర్ మనోజ్ బాజ్‌పాయ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'లాస్ట్ మ్యాన్ ఇన్ టవర్'. దర్శకుడు బెన్ రేఖి తెరకెక్కించిన ఈ సినిమాలో బోమన్ ఇరానీ, దివ్య దత్తా కీలక పాత్రల్లో నటించారు. టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో ముంబైలోని అంధేరి వెస్ట్‌లో నిర్వహించిన ప్రమోషన్స్‌లో పాల్గొన్న మనోజ్ బాజ్‌పాయ్ నటన, పాత్రల ఎంపికపై తన అభిప్రాయాలను వెల్లడించారు. సినిమాల్లో ఒక నిర్దిష్ట వయస్సుకు చెందిన పాత్రల్లో నటించాల్సి వచ్చినప్పుడు నటులు పెద్దగా వయస్సు గురించి ఆలోచించరని ఆయన అన్నారు. ఒక నటుడిగా తనకు పాత్రలోని లోతులు, విభిన్నమైన షేడ్స్, క్యారెక్టర్ డెప్త్ ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. మానవ నైజంలాగే ప్రతి పాత్ర కూడా ఉల్లిపాయ పొరల మాదిరిగా ఎన్నో విభిన్న కోణాలను కలిగి ఉంటుందని, వాటన్నింటినీ తెరపై సరిగ్గా ఆవిష్కరించడం అంత సులభం కాదని పేర్కొన్నారు. స్క్రిప్ట్ చదివే సమయంలోనే పాత్ర నేపథ్యం, దాని ప్రాధాన్యతను అర్థం చేసుకుని నటులు తమ ప్రిపరేషన్ ప్రారంభిస్తారని, అయితే అసలైన నటన మాత్రం షూటింగ్ మొదలైన తర్వాతే మొదలవుతుందని మనోజ్ తెలిపారు. సెట్‌లో తోటి నటీనటుల ఎనర్జీ, వారి నటనా శైలి, లోకేషన్ అంబియెన్స్ ఆధారంగా ఒక సన్నివేశం అక్కడికక్కడే కొత్త మలుపులు తీసుకుంటుందని వివరించారు. ముందుగానే చేసుకున్న ప్రిపరేషన్ కంటే షూటింగ్ సమయంలో అనుకోకుండా పుట్టుకొచ్చే కొత్త ఆలోచనలు, ఇంప్రొవైజేషన్ల వైపే నటులు ఎక్కువగా ఆకర్షితులవుతారని అన్నారు. కెమెరా ముందుకు వెళ్లే క్షణం వరకు ఒక పాత్రలోకి ప్రవేశించడం చీకటి గుహలోకి అడుగుపెట్టినట్టుగా కాస్త భయంగా అనిపించినా.. ఒక్కసారి నటన మొదలైన తర్వాత ఆ ప్రయాణాన్ని ఎంతో ఆస్వాదిస్తామని మనోజ్ బాజ్‌పాయ్ చెప్పుకొచ్చారు. దీంతో 'లాస్ట్ మ్యాన్ ఇన్ టవర్'లో ఆయన ఎలాంటి నటనా విశ్వరూపం చూపించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.

## విజయ్ సేతుపతి - సాయి పల్లవి.. మణిరత్నం కాంబోపై క్లారిటీ

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, లెజెండరీ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో తెరకెక్కబోయే మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌పై కొంతకాలంగా ఆసక్తికరమైన వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రంలో నేచురల్ బ్యూటీ సాయి పల్లవి హీరోయిన్‌గా నటించనున్నట్లు ఇప్పటికే ఊహాగానాలు రావడంతో సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా ఈ వార్తలకు మరింత బలం చేకూరుస్తూ మేకర్స్ ఓ మైండ్ బ్లోయింగ్ ప్రోమోను విడుదల చేశారు. సినిమా టైటిల్‌ను సెప్టెంబర్ 7న అధికారికంగా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. కోల్‌కతా నగర నేపథ్యాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించిన ఈ ప్రోమో చివర్లో విజయ్ సేతుపతి, సాయి పల్లవి కేవలం తమ ఒంటి కంటితోనే అద్భుతమైన హావభావాలు పలికించడం ఆకట్టుకుంది. ''వెలుతురు, నీడల మధ్య.. జీవితం తన రంగులను కనుగొంటుంది'' అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచింది. లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ పతాకాలపై సుభాస్కరన్ ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనుండటంతో ఈ క్రేజీ కాంబినేషన్‌పై అంచనాలు మరింత పెరిగాయి. సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన పూర్తి వివరాలను టైటిల్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా మేకర్స్ వెల్లడించే అవకాశం ఉంది.

## ఇప్పుడు హీరోలు స్మగ్లర్లు.. క్రిమినల్స్



'ఇంటింటి గృహలక్ష్మి' సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైన నటి కస్తూరి శంకర్.. ప్రస్తుతం సినిమాల్లోనూ వరుస అవకాశాలతో రాణిస్తున్నారు. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న కస్తూరి.. ప్రస్తుత సినిమాల తీరుపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్యకాలంలో అన్ని రకాల కథలు వస్తున్నాయని, వాటిలో ఏ సినిమానూ తక్కువ చేయడం తన ఉద్దేశం కాదని అన్నారు. సినిమాను సినిమాగానే చూడాలనే మాటతో తాను ఏకీభవిస్తానని చెబుతూనే.. తాను పెరిగిన రోజుల్లో వచ్చిన చిత్రాలను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు 'మాయాబజార్', 'కృష్ణార్జున యుద్ధం' వంటి సినిమాలు చూసి పెరిగానని, అప్పట్లో తన దృష్టిలో తెలుగు సినిమాలో హీరో అంటే దేవుడిలా ఉండేవాడని కస్తూరి తెలిపారు. దేవుడు వస్తాడు, అవతారాలు ఎత్తుతాడు అనే స్థాయిలో హీరో పాత్రలను ఊహించుకునేవాళ్లమని చెప్పారు. ఆ తర్వాత సామాజిక నేపథ్యం ఉన్న సినిమాలు వచ్చాయని, వాటిలో హీరోలు పోలీస్, లాయర్, విప్లవకారుడు, న్యాయం కోసం పోరాడే వ్యక్తి వంటి పాత్రల్లో కనిపించేవారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, సినిమాల్లో హీరోలు స్మగ్లర్లు, క్రిమినల్స్ వంటి పాత్రల్లో ఎక్కువగా కనిపిస్తున్నారని కస్తూరి అన్నారు. ఇలాంటి సినిమాలు వరుసగా వస్తున్న నేపథ్యంలో సామాజిక బాధ్యతతో, ప్రేక్షకులకు ఓ సందేశాన్ని అందించే చిత్రాలు చాలా అరుదుగా వస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అలాంటి సామాజిక బాధ్యతతో తెరకెక్కిన సినిమానే 'ధర్మస్థల నియోజకవర్గం' అని కస్తూరి శంకర్ పేర్కొన్నారు. దీంతో ప్రస్తుత సినిమాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

## 'అంతా రాములోరు చూసుకుంటారు'.. టైటిల్‌తోనే ఆసక్తి పెంచుతున్న సినిమా



యంగ్ ప్రామిసింగ్ హీరో సంగీత్ శోభన్, యంగ్ బ్యూటీ అనస్వర రాజన్ జంటగా నటిస్తున్న కొత్త చిత్రానికి 'అంతా రాములోరు చూస్కుంటారు' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌ను తాజాగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకులకు నచ్చిందని, సినిమా కూడా థియేటర్లలో అందరినీ అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. సినిమాలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుందని, ముఖ్యంగా గోదావరి జిల్లాల అందమైన నేపథ్యం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పింది. అక్కడి వాతావరణం మినీ కేరళను తలపించిందని, స్థానికులు చూపించిన ఆత్మీయతతో పాటు అక్కడి ఆహారం, ప్రత్యేక స్వీట్లు ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపింది. సినిమా షూటింగ్ ఇంకా కొంత భాగం పూర్తి చేయాల్సి ఉందని, ప్రేక్షకులంతా కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్లకు వచ్చి సినిమాను ఆస్వాదించాలని కోరింది. సినిమాలోని శిరీష, మారుతి పాత్రలను ప్రేక్షకులు ఎంతగానో ప్రేమిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, మెగాస్టార్ చిరంజీవితో స్క్రీన్ షేర్ చేసుకోవడంపై కూడా అనస్వర ఆనందం వ్యక్తం చేసింది. చిరంజీవితో కలిసి నటించడం తనకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందని చెప్పింది. 'కాకా' సినిమాను ప్రతి ఒక్కరూ థియేటర్లలో తప్పకుండా ఎంజాయ్ చేస్తారని, ముఖ్యంగా మెగాస్టార్ అభిమానులకు ఈ చిత్రం మరింత నచ్చుతుందని పేర్కొంది. శ్రీమతి శ్రావణి సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్మెంట్, వీ.జీ.బీ. ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్స్‌పై సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, న్యూ యాస్పిరెంట్ ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. గోదావరి జిల్లాల నేటివిటీ, ప్రేమ, కుటుంబ భావోద్వేగాలను మేళవిస్తూ రూపొందుతున్న 'అంతా రాములోరు చూస్కుంటారు'పై టైటిల్ గ్లింప్స్‌తోనే ఆసక్తి నెలకొంది.

## బిగ్‌బాస్ 10.. ఈసారి మైండ్ గేమ్ గట్టిగానే!




తెలుగు బుల్లితెరపై అత్యంత ప్రేక్షకాదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్‌బాస్' 10వ సీజన్ మరికొద్ది సేపట్లో గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. నేడు సాయంత్రం 7 గంటలకు షోకు తెరలేవనుండగా.. తాజాగా మేకర్స్ విడుదల చేసిన ప్రోమో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అంచనాలను మరింత పెంచుతోంది. ముఖ్యంగా ఈసారి బిగ్‌బాస్ హౌస్‌ను మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్తగా డిజైన్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొత్త హౌస్‌ను చూసిన హోస్ట్ అక్కినేని నాగార్జున సైతం ఆశ్చర్యానికి గురైనట్లు ప్రోమోలో చూపించారు. అంతేకాదు.. ఈ సీజన్‌లోకి ప్రత్యేకంగా ఓ రోబోను తీసుకురావడం ఆసక్తిని మరింత పెంచింది. 'నీకు అన్నీ తెలుసని భావిస్తున్నావు.. కానీ బిగ్‌బాస్ ఇంట్లో కావాల్సింది కేవలం డేటా మాత్రమే కాదు.. తెలివితేటలు, లెక్కలు, ఎమోషన్స్‌తో కూడిన చిక్కులు' అంటూ నాగార్జున రోబోతో చెప్పిన డైలాగ్ ఈసారి షోలో మైండ్ గేమ్‌కు పెద్దపీట వేయబోతున్నారనే సంకేతాలను ఇస్తోంది. ఇక ఈ సీజన్‌లో 'అగ్నిపరీక్ష' రౌండ్ ద్వారా ఎంపికైన టాప్ 13 మంది కంటెస్టెంట్లు బిగ్‌బాస్ స్టేజ్‌పై సందడి చేయనున్నారు. అయితే తాజాగా విడుదలైన ప్రోమోలో జానపద గాయని, రైతుబిడ్డ ఝాన్సీ మాత్రమే హౌస్‌లోకి ఎంట్రీ ఇవ్వడం, టాస్కులలో పాల్గొనడం కనిపించింది. మిగిలిన కంటెస్టెంట్ల వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లో ఉంచినప్పటికీ.. సోషల్ మీడియాలో మాత్రం పోటీదారుల పేర్లపై జోరుగా ప్రచారం జరుగుతోంది. జబర్దస్త్ ఆటో రాంప్రసాద్, నటుడు టెంపర్ వంశీ, ఆదిత్ అరుణ్, వర్షిణి సౌందరరాజన్, చైత్ర రాయ్, ముఖేష్ గౌడ, తేజస్విని గౌడతో పాటు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సుధీర్ రెడ్డి, పొట్టి నరేష్ తదితరులు హౌస్‌లోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే వీరిలో అధికారికంగా ఎవరు బిగ్‌బాస్ ఇంట్లోకి ఎంట్రీ ఇస్తారన్నది మాత్రం నేటి గ్రాండ్ ఓపెనింగ్‌తోనే తేలనుంది. సరికొత్త హౌస్, రోబోతో కొత్త మైండ్ గేమ్, ఊహించని ట్విస్టులు, టాప్ 13 కంటెస్టెంట్లతో ఈసారి బిగ్‌బాస్ సీజన్ మరింత ఆసక్తికరంగా సాగుతుందనే అంచనాలు నెలకొన్నాయి.

## 'గోల్డ్ స్పాట్' గ్లింప్స్‌కు టైమ్ ఫిక్స్

అభిషేక్, కాజల్ చౌదరి హీరోహీరోయిన్లుగా ర్యాడిక్స్ సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న చిత్రం 'గోల్డ్ స్పాట్'. నిర్మాత రవితేజ పచ్చిపాల నిర్మిస్తున్న ఈ సినిమాకు 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న దుష్యంత్ కటికనేని కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందిస్తున్నారు. ఆయన వద్ద దర్శకత్వ విభాగంలో పనిచేసిన వేణు కార్తికేయన్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన 'గోల్డ్ స్పాట్' టైటిల్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించగా.. తాజాగా మేకర్స్ గ్లింప్స్ అప్డేట్‌తో ఆసక్తిని మరింత పెంచారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక గ్లింప్స్‌ను సెప్టెంబర్ 7న ఉదయం 11:11 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల కానున్న చిన్న వీడియో ద్వారా సినిమా ప్రపంచం, కథా నేపథ్యాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్‌ను బట్టి చూస్తే.. గత జ్ఞాపకాలు, మనసుకు హత్తుకునే సున్నితమైన బంధాల చుట్టూ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. కొత్త దర్శకుడు వేణు కార్తికేయన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అభిషేక్, కాజల్ చౌదరి జంటగా ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేయనున్నారో, 'గోల్డ్ స్పాట్' అసలు కథేంటో గ్లింప్స్ ద్వారా మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## బాలయ్య 'దాదా'.. డిసెంబర్ 24న దుమ్మురేపేందుకు రెడీ



మ్యాన్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ వచ్చేసింది. బాలయ్య, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీకి టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటివరకు 'ఎన్‌బీకే111' అనే వర్కింగ్ టైటిల్‌తో పిలుస్తున్న ఈ చిత్రానికి 'దాదా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ బాలయ్య మార్క్ మాస్ యాటిట్యూడ్‌తో ఆకట్టుకుంటోంది. 'నాకు గురిపెట్టడానికి ఒంట్లో పొగరు.. వేలుకి ట్రిగర్ ఉంటే సరిపోదు.. బుల్లెట్స్‌కి బలుపు ఉండాలి... గన్స్‌కి గట్స్ ఉండాలి..!' అంటూ బాలకృష్ణ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. అంతేకాదు ఈ చిత్రాన్ని ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'వీరసింహారెడ్డి' వంటి సంచలన విజయవంతమైన చిత్రం తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'దాదా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మంచు మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో సరికొత్త లుక్‌తో మెప్పించనున్నారు. బాలయ్య మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్, పవర్‌ఫుల్ డైలాగులతో తెరకెక్కుతున్న ఈ సినిమా క్రిస్మస్ బరిలో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.